జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

ఏపీ డీఎస్సీ ఎస్‌జీటీ మోడల్ ప్రశ్నలు

1. దేశంలో తొలి అండర్ వాటర్ మెట్రో టన్నెల్‌ను 2024 మార్చి 6న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ టన్నెల్‌ని ఏ నది దిగువన నిర్మించారు?
   1) హుగ్లీ 2) తపతి 3) గంగా 4) గోదావరి
2. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాముల పేర్లను ప్రధాని మోదీ 2024 ఫిబ్రవరి 27న ప్రకటించారు. అయితే దిగువ పేర్కొన్నవారిలో గగన్‌యాన్ వ్యోమగాములు ఎవరు?
   1. పి.బాలకృష్ణన్ నాయర్ 2. అజిత్ కృష్ణన్
   3. అంగద్ ప్రతాప్ 4. శుభాంశు శుక్లా
   1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
   3) 2, 3, 4 మాత్రమే 4) 1, 2, 3, 4 మాత్రమే
3. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
   1. రాజస్థాన్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భజన్ లాల్ శర్మ ప్రమాణం చేశారు.
   2. భజన్‌లాల్ శర్మ రాజస్థాన్‌లోని సంగనేర్ నియోజక వర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు.
   3. రాజస్థాన్‌లోని మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు గాను భారతీయ జనతా పార్టీ(బీజేపీ) 105 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని విజయాన్ని సాధించింది.
   4. రాజస్థాన్ రాష్ట్ర గవర్నర్‌గా ప్రస్తుతం మంగుభాయ్ సీ పటేల్ వ్యవహరిస్తున్నారు.
   1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
   3) 1, 4 మాత్రమే 4) 1, 2, 3, 4
4. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
   1. సూర్యుని గుట్టు విప్పేందుకు భారత్ తొలిసారి 'పీఎస్ఎల్‌వీ-సీ57' రాకెట్ ద్వారా ప్రయోగించిన వ్యోమనౌక ఆదిత్య-ఎల్ 1 ఇటీవల లగ్రాంజ్ పాయింట్ (ఎల్ 1)కు చేరుకుంది.
   2. గ్రహణాల సందర్భంలో ఎలాంటి అడ్డులేకుండా నిరంతరంగా సూర్యుడిని చూసేలా అనువైన ఎల్ 1 పాయింట్‌లో ఉంటూ ఆదిత్య - ఎల్ 1 అధ్యయనం చేయనుంది.
   3. భూమికి సూర్యునికి మధ్య దూరం 15 కోట్ల కిలోమీటర్లు కాగా అందులో ఒక శాతం అంటే 15 లక్షల కిలోమీటర్ల దూరాన్ని లగ్రాంజ్ పాయింట్ (ఎల్ 1) గా గణిస్తున్నారు.
   4. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ మంత్రిగా ప్రస్తుతం భూపేందర్ సింగ్ యాదవ్ వ్యవహరిస్తున్నారు.
   5. ఈ మిషన్‌కు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వీర ముత్తువేల్ వ్యవహరించారు.
   1) 1, 2, 3 మాత్రమే 2) 1, 2, 4 మాత్రమే
   3) 1, 2, 5 మాత్రమే 4) 1, 2, 3, 4, 5
5. కింది వారిలో పార్లమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికిచ్చే సంసద్ రత్న అవార్డులను 2024కి గాను ఎవరికి ప్రకటించారు?
   ఎ. సుకాంత మజుందార్ బి. సుధీర గుప్తా
   సి. శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే డి. కుల్దీప్ రాయ్
   ఇ. అమోల్ రామ్ సింగ్ కొల్హే
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి, ఇ
   3) ఎ, సి, డి, ఇ 4) ఎ, బి, సి, డి, ఇ
6. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
   1. రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్ దేశానికి రక్షణ పరికరాలను అందిస్తామని నాటో కూటమిలోని జీ-7 దేశాలు ప్రకటించాయి.
   2. ఈ కూటమిని 1999లో ఏర్పాటు చేశారు
   3. జీ-7 కూటమిలోని సభ్య దేశాలు-యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా
   4.జీ-7 కూటమిలో భారతదేశానికి సభ్యత్వం ఉంది
   5. 49వ జీ-7 కూటమి సదస్సు 2023 మేలో జపాన్‌లోని హిరోషిమాలో జరిగింది.
   6. 50వ జీ-7 కూటమి సదస్సు 2024లో ఇటలీలోని పూగిలలో జరుగనుంది.
   1) 1, 2, 3 మాత్రమే 2) 1, 2, 3, 4 మాత్రమే
   3) 1, 3, 5, 6 మాత్రమే 4) 1, 2, 3, 4, 5, 6
7. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి
   1. భారత సంతతి రచయిత్రి నందినీ దాస్‌ను '2023 బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్' వరించింది
   2. నందినీ దాస్ రచించిన కోర్టింగ్ ఇండియా: ఇంగ్లండ్, మొఘల్ ఇండియా అండ్ ద ఆరిజన్స్



   ఆఫ్ ఎంపైర్ అనే పుస్తకం దీనికి ఎంపికైంది.
   3. ప్రపంచంలో సాంస్కృతిక అవగాహన పెంపొందిస్తున్నందుకు నందిని దాస్‌కు ఈ పురస్కారం కింద రూ.50 లక్షల నగదు బహుమతిని అందజేస్తారు.
   1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
   3) 1, 3 మాత్రమే 4) పైవన్నీ
8. కింది వాటిలో సరైన జతను గుర్తించండి
   1. బహ్రెయిన్ గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత-మాక్స్ వెర్ స్టాపెన్
   2. సౌదీ అరేబియా గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత-మాక్స్ వెర్ స్టాపెన్
   3. మియామీ గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత -సెర్గియో పెరేజ్. 4. మొనాకో గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత-మాక్స్ వెర్ స్టాపెన్
   1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
   3) 3, 4 మాత్రమే 4) 1, 4 మాత్రమే
9. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
   1. 'ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ)' దళానికి 25వ డైరెక్టర్ జనరల్‌గా 'రాకేష్ పాల్' నియమితులయ్యారు. 2. ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ) దళాన్ని 1975లో స్థాపించారు
   3. ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ) దళం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో విధులను నిర్వర్తిస్తుంది
   4. ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ) దళం ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది
   5. భారత నావికాదళ ప్రస్తుత అధిపతి- అడ్మిరల్ ఆర్.హరికుమార్
   1) 1, 2, 3 మాత్రమే 2) 2, 3, 4 మాత్రమే
   3) 1, 4, 5 మాత్రమే 4) 1, 2, 3, 4, 5
10. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
   1. భారతదేశం వెలుపల తొలిసారి టాంజానియా దేశంలోని జాంజి బార్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) సంస్థ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నారు.
   2. దీనిపై ఐఐటీ మద్రాస్, టాంజానియా విద్యా ఒకేషనల్ ట్రైనింగ్ మంత్రిత్వశాఖ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.
   3. భారతదేశంలో ఏర్పాటు చేసిన తొలి ఐఐటీ- 'ఐఐటీ బాంబే'
   4. టాంజానియా దేశ ప్రస్తుత అధ్యక్షుడు- సమియా సులుహు హసన్
   1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
   3) 1, 2, 3 మాత్రమే 4) 1, 2, 4 మాత్రమే
11. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి
   1. 2023 అక్టోబరులో జరిగిన వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చింది
   2. 2023 అక్టోబరు 5 నుంచి నవంబరు 19 వరకు 48 మ్యాచ్‌లు జరిగాయి
   3. భారత్ ఇప్పటి వరకు రెండు(1983, 2011) ప్రపంచ కప్‌లు గెలుచుకుంది
   4. 2023లో విజేతగా ఆస్ట్రేలియా జట్టు నిలిచింది
   1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
   3) 3, 4 మాత్రమే 4) 1, 2, 3, 4 మాత్రమే
12. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి
   1. ఇటీవల వార్తల్లో నిలిచిన 'ముస్తఫా మద్ బౌలి' ఈజిప్టు దేశానికి ప్రధానమంత్రిగా వ్యవహరిస్తున్నారు. 2. ఈజిప్టు దేశ ప్రస్తుత అధ్యక్షుడు- అబ్దుల్ ఫతా ఎల్-సీసీ
   3. భారత్‌లో ఉన్న దావూది బోహ్రా తెగ ముస్లింలు ఈజిప్టుకు చెందినవారే.
   4. గత 26 ఏళ్ల తరవాత భారత ప్రధాని తొలిసారి ఇటీవల ఈజిప్టును పర్యటించారు
   1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
   3) 3, 4 మాత్రమే 4) 1, 2, 3, 4
13. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి
   1. సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు.
   2. జాతీయ న్యాయ సేవలు ప్రాధికార సంస్థ(నల్సా)కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఇటీవల జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నియమితులయ్యారు
   3. సుప్రీంకోర్టు 50వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం డీ.వై చంద్రచూడ్ వ్యవహరిస్తున్నారు.
   4. కేంద్ర న్యాయశాఖమంత్రిగా ప్రస్తుతం అర్జున్ రామ్ మెఘ్వాల్ వ్యవహరిస్తున్నారు.
   5. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ వ్యవహరిస్తున్నారు.
   1) 1, 2, 3 మాత్రమే 2) 1, 2, 4 మాత్రమే
   3) 3, 4, 5 మాత్రమే 4) 1, 2, 3, 4, 5
14. చెస్ క్రీడలో ఉండే గడుల సంఖ్య?
   1) 36 2) 64 3) 100 4) 49
15. జ్ఞానపీఠ్ అవార్డ్ పొందిన తొలి తెలుగు రచయిత?
   1) విశ్వనాథ సత్యనారాయణ
   2) పీ.వీ.నరసింహారావు 3) గురజాడ అప్పారావు
   4) సీ. నారాయణ రెడ్డి

దిక్సూచి DIKSUCHI

16. కింది వాటిలో తప్పుగా ఉన్న జతను గుర్తించండి.
   1) షెహనాయ్ - బిస్మిల్లాఖాన్
   2) వేణువు - హరిప్రసాద్ చౌరాసియా
   3) మృదంగం - షేక్ చినమౌలానా
   4) సితార - రవిశంకర్

విద్యా దృక్పథాలు

17. 'గృహస్థాశ్రమం' పదానికి సరైన అర్థాన్ని సూచించేది?
   1) భగవంతుని పూజించడం
   2) గురుకులాల్లో విద్యాభ్యాసం
   3) జీవిత సౌఖ్యాలకు దూరంగా ఉండడం
   4) వైవాహిక జీవితాన్ని గడపడం
18. 'త్రిపీఠకాలు' వీరి బోధనలు
   1) వర్ధమానుడు 2) బుద్ధుడు
   3) ఆదిశంకరాచార్యుడు 4) రామానుజుడు
19. పాఠశాలల్లో రోజువారీ జరిగే నగదు లావాదేవీలకు చెందిన వివరాలు ఈ రికార్డులో నమోదు చేస్తారు
   1) క్యాష్ పుస్తకం 2) లెడ్జర్
   3) ఆకస్మిక ఖర్చుల పుస్తకం(కంటిజెన్సీ రికార్డ్)
   4) జమ వివరాల పుస్తకం(రెమిటెన్సీ రికార్డ్)
20. పాఠశాల క్యాలెండర్‌లో చేర్చదగని అంశం
   1) అన్ని రకాల సెలవులు
   2) ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి సంబంధించిన సెలవులు, ప్రమోషన్లు, పదవీ విరమణ వివరాలు
   3) పబ్లిక్, పాఠశాల పరీక్షల తేదీలు
   4) స్కూల్, కమిటీలు, టీచర్ అసోసియేషన్లు, స్థానిక విహార యాత్రలు, పాఠశాల పోటీల సమావేశాల తేదీలు

సమాధానాలు
1) 1 2) 4 3) 1 4) 1 5) 4 6) 3 7) 1 8) 4 9) 3 10) 4 11) 4 12) 4 13) 3 14) 2 15) 1 16) 3 17) 4 18) 2 19) 1 20) 2




ఆకిశెట్టి వెంకటస్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/gQbvrfkలో చదవండి.

విజయవాడలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)- బీసీ ఆర్‌జేసీ సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 18 ఇంగ్లీష్ మీడియం కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. బాలురకు, బాలికలకు విడివిడిగా కాలేజీలు ఉన్నాయి. మొత్తం 2600 సీట్లు ఉండగా వీటిలో 1300 సీట్లను బాలికలకు ప్రత్యేకించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఎంచుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులకు ఐఐటీ జేఈఈ/నీట్ పరీక్షలకు సంబంధించి కోచింగ్ సౌకర్యం కల్పిస్తారు. 75 శాతం సీట్లను బీసీ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉన్నవారికి కేటాయించారు. మిగిలిన 25 శాతం సీట్లను సాంఘిక సంక్షేమ/గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదివినవారికి, సంబంధిత హాస్టళ్లలో ఉన్నవారికి, జడ్పీ స్కూళ్లు/ప్రైవేట్ పాఠశాలల్లో చదివినవారికి నిర్దేశించారు.

ఎంజేపీఏపీబీసీఆర్‌జేసీ సెట్ నోటిఫికేషన్



ఎంజేపీ ఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్/బయాలజీ నుంచి 50, ఫిజికల్ సైన్స్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. ఎంఈసీ/సీఈసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్ నుంచి 30, సోషల్ స్టడీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. విద్యార్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్ పా యింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పెన్సిల్ ఉపయోగించకూడదు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లోపు ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఎంజేపీ ఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 13
- **వెబ్‌సైట్:** mjpapbcwreis.apcfss.in/

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరోతరగతి ప్రవేశాలు

అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం- ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 164 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశ పరీక్ష అయిదోతరగతి స్థాయిలో ఉంటుంది. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో పరీక్ష రాయవచ్చు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ విద్యార్థులకు 35 మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు రావాలి. ఈ స్కూళ్లలో బోధన ఉచితం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తారు.

అర్హత: ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగు, అయిదు తరగతులు చదివి ఉండాలి. జనరల్, బీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.150; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.75
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 21
- **విద్యార్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 27
- **తరగతులు ప్రారంభం:** జూన్ 12 నుంచి
- **వెబ్‌సైట్:** https://apms.apcfss.in

నవ్య | చిత్రజ్యోతి

థియేటర్లు బద్దలవుతాయ్

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకొన్న చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో వీ సెల్యులాయిడ్ సంస్థ నిర్మిస్తోంది. శుక్రవారం ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు కామెడీ సన్నివేశాలను డీల్ చెయ్యడంలో దర్శకుడు శ్రీహర్ష మరోసారి తన ప్రతిభను చూపించారు. ట్రెజర్ హంట్, హారర్, థ్రిల్లర్ , ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు కలిగిన ట్రైలర్ సినిమా మీద అంచనాలు పెంచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఈ నెల 22న థియేటర్స్‌కు రండి. మీరు నవ్విన నవ్వులకు థియేటర్లు బద్దలవుతాయ్. మిమ్మల్ని నవ్వించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాం. దర్శకుడు శ్రీహర్ష హిలేరియస్‌గా ఈ సినిమా తీశారు' అన్నారు. ట్రైలర్‌లో కంటే సినిమాలో ఎనర్జీ వంద రెట్లు ఎక్కువ ఉంటుంది. ఈ నెల 22న అందరూ మీ గ్యాంగ్స్‌తో రండి. టెన్ టైమ్స్ ఎంటర్‌టైన్ అవుతారు' అని చెప్పారు దర్శకుడు శ్రీహర్ష. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత సునీల్ బలుసు, ప్రియదర్శి, వంశీ తదితరులు పాల్గొన్నారు





హిట్ ఇచ్చారు.. థాంక్స్

గోపీచంద్

గోపీచంద్ హీరోగా కన్నడ దర్శకుడు ఎ హర్ష రూపొందించిన 'భీమ' చిత్రం ఇటీవల విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన థాంక్స్ మీట్‌లో హీరో గోపీచంద్ మాట్లాడుతూ 'ఇంతమంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. రెండు క్యారెక్టర్స్‌లో చక్కని వేరియేషన్స్ చూపించారని అంటున్నారు. గ్రాఫిక్స్, యాక్షన్, కామెడీ అద్భుతంగా కుదిరాయి. ఇంత మంచి కథ తీసుకువచ్చి, కమర్షియల్ ప్యాక్డ్ సినిమా తీసిన దర్శకుడు హర్షకు, ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించిన నిర్మాతలు రాధామోహన్, శ్రీధర్‌కు కృతజ్ఞతలు' అని అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష తెలుగు ప్రేక్షకుల నాడిని పట్టుకుని సినిమాను ఆద్యంతం గ్రిప్పింగ్‌గా తీశారు. పతాక సన్నివేశాలు సినిమాకే హైలైట్' అని ప్రశంసించారు. సంపత్‌నంది మాట్లాడుతూ 'మైథాలజీ, ఫాంటసీ అంశాలు జోడించి తీసిన మంచి కమర్షియల్ సినిమా 'భీమ'. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఫైట్ చూస్తుంటే పరశురాముడు ఇలాగే ఉంటాడమో అనిపించింది' అన్నారు. ముంబైలో సినిమా చూశాననీ, ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని హీరోయిన్ మాళవిక చెప్పారు. తన తొలి తెలుగు చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు దర్శకుడు హర్ష. రోజురోజుకీ కలెక్షన్లు పెరుగుతున్నాయని చెబుతూ మంచి విజయం అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు నిర్మాత రాధామోహన్.

సినీ నటుడు వెంకటేశ్ రెండో కుమార్తె హవ్యవాహిని వివాహం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులు హవ్యవాహిని, డాక్టర్ నిశాంత్‌ను ఆశీర్వదించారు.




'అర్జునుడి గీతోపదేశం'



వరలక్ష్మి శరత్‌కుమార్ మెయిన్ లీడ్‌గా, అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'అర్జునుడి గీతోపదేశం' చిత్రం శుక్రవారం ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సతీశ్ గోగాడ దర్శకత్వంలో త్రిలోక్‌నాథ్, ప్రదీప్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు మల్లా సీతారామరాజు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, కనుమెలి అమ్మిరాజు తొలి క్లాప్ ఇచ్చారు. లక్కంశెట్టి వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 20 నుంచి అమలాపురంలో తొలి షెడ్యూల్ ప్రారంభిస్తున్నాం. ఆ తర్వాత వైజాగ్, హైదరాబాద్, చెన్నైలో షూటింగ్ చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, ఫొటోగ్రఫీ: చైతన్య కందుల, ఎడిటింగ్: అర్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరికృష్ణ

అమితాబ్‌కు యాంజియోప్లాస్టీ



బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్‌బచ్చన్ అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం ముంబైలోని కోకిలాబెన్ హాస్పిటల్‌లో చేరారు. వైద్యులు ఆయన కాలికి యాంజియోప్లాస్టీ చేశారు. సాయంత్రం అమితాబ్ డిశ్చార్జి అయ్యారు. ఆయన త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షించారు. 'ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటాను' అని బిగ్ బి సోషల్ మీడియాలో స్పందించారు. ప్రస్తుతం ఆయన 'కల్కి 2898 ఏడీ' సహా పలు చిత్రాల్లో నటిస్తున్నారు.

భయపెట్టే అనన్య



సుమన్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'అనన్య'. జయరామన్, చందన జంటగా నటించారు. ప్రసాద్ రాజు బొమ్మిడి దర్శకత్వంలో జంధ్యాల గంగాధర శర్మ నిర్మించారు. ఈ నెల 22న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రమిది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందించామని దర్శకుడు తెలిపారు. సినిమా ఆద్యంతం ఉత్కంఠ కలిగిస్తుంది, ఈ జానర్‌లో ట్రెండ్ సెట్ చేస్తుంది అని నిర్మాత తెలిపారు.



ఫిల్మ్ మేకర్ కథగా భరతనాట్యం

సూర్య తేజ ఏలే, మీనాక్షి గోస్వామి నటిస్తున్న చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. వైవా హర్ష, హర్షవర్ధన్, అజయ్ ఘోష్, సలీం ఫేకు, టెంపర్ వంశీ కీలక పాత్రలు పోషించారు. పాయల్ సరాఫ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ మూవీ నుంచి 'చేశావు ఏదో మాయ' అనే సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. అలాగే, ఏప్రిల్ 5న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు ప్రకటించారు. ఓ ఔత్సాహిక ఫిల్మ్‌మేకర్ జీవితంలో ఎదుర్కొనే సమస్యలను ఇందులో చూపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ గిరిజాల, డీఓపీ: వెంకట్ ఆర్ శాకమూరి, సంగీతం: వివేక్ సాగర్.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/thEE2d8లో చదవండి.



ఎన్నికల నగారా..

నేడే

- మధ్యాహ్నం 3 గంటలకు షెడ్యూల్ ప్రకటన
- ఆ వెంటనే అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి
- ఏ దశలో ఎన్నికలు జరుగుతాయనేదానిపై సర్వత్రా ఉత్కంఠ

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నగార శనివారం మోగనుంది. జాతీయ ఎన్నికల సంఘం ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటన శనివారం మధ్యాహ్నం ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తుంది, ఆంధ్రప్రదేశ్‌లో ఏ దశలో జరుగుతాయనే అంశాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. 2019లో తొలి విడతలోనే ఏపీలో ఎన్నికలు జరిగాయి. ఈ దఫా ఏ విడతలో జరుగుతాయో చూడాలి. కొన్ని పార్టీలు తొలి విడతలో జరగాలని, చివరి విడతల్లో జరిగితే బావుంటుందని మరికొన్ని పార్టీలు భావిస్తున్నాయి. అయితే ఏ విషయం శనివారం సాయంత్రం లోపు తేలిపోతుంది. ఢిల్లీలో ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే జిల్లా ఎన్నికల అధికారులు వేణుగోపాల్‌రెడ్డి(గుంటూరు), శివశంకర్ (పల్నాడు), రంజిత్‌బాషా (బాపట్ల)లు ఎక్కడికక్కడ విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. షెడ్యూల్ ప్రకటన తర్వాత నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని ఆయా అధికారులు ప్రకటిస్తారు. ఆ తర్వాత నుంచి అనుమతి లేని ఫ్లెక్సీలు, జెండా దిమ్మెల తొలగింపు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగడం వంటివి చేపడతారు.

ఇక నుంచి ఖర్చులకు కట్టడే..

ఇప్పటివరకు ఎన్నికల్లో సీట్లు ఆశిస్తున్న అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల కోసం పెద్ద ఎత్తున ఖర్చు పెట్టారు. సీట్లు ఖరారు అయిన వారు కూడా ప్రచారాల కోసం విస్తృతంగా వ్యయం చేస్తున్నారు. అయితే శనివారం షెడ్యూల్ ప్రకటన తర్వాత నుంచి అంటే శనివారం నుంచి ఆచితూచి ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ప్రచారాలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆమోదం తీసుకోవాలి. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడే ఖర్చులు పెట్టి ఆ వివరాలను ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ కమిటీకి అందజేయాల్సి ఉంటుంది. అంటే ఒకవిధంగా వారి ప్రచార ఖర్చులకు కళ్లెం పడినట్లే.

ప్రతీ దానికి అనుమతి తీసుకోవాల్సిందే

ఆదివారం నుంచే జిల్లా వ్యాప్తంగా జరిగే రాజకీయ పార్టీల సభలు, ర్యాలీలు, సమావేశాలకు ముందస్తుగా పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలానే రాత్రి 10 గంటల వరకే ఎన్నికల ప్రచార కార్యక్రమాల నిర్వహణకు అనుమతి ఉంటుంది. వీవీఐపీల పర్యటనల సమయంలో హెలికాప్టర్లు, డ్రోన్లకు కూడా అనుమతులు తీసుకోవాలి.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు శుభం కార్డు

కొన్ని రోజుల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు పెద్దఎత్తున అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇటీవల సిమెంట్‌రోడ్లు, పైపులైన్లు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి పనులు చేయిస్తున్నారు. కొన్ని అయితే ఇప్పటికే పూర్తికాగా వాటిని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవాలు కూడా చేశారు. వీటికి శనివారం సాయంత్రం నుంచి శుభంకార్డు పడనుంది. ఇకపై ఎవరైనా శంకుస్థాపన చేసినా, అభివృద్ధి పనికి ప్రారంభోత్సవం జరిపినా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. వలంటీర్లను పోలింగ్ ఏజంట్లుగా కూడా నియమించడానికి వీల్లేదని ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎస్ ఉత్తర్వులను పంపించారు. దీంతో శనివారం నుంచి వలంటీర్ల కదలికలపై గట్టి నిఘానే ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.23(శనివారం)
సహేరీ (ఉదయం) 4.58 (ఆదివారం)

బొప్పూడిలో.. ప్రజాగళం



- రేపటి సభకు నామకరణం
- 300 ఎకరాల్లో అసాధారణ ఏర్పాట్లు
- పనులను పరిశీలించిన కూటమి నేతలు
- ఎస్‌పీజీ నిఘాలో వేదిక, హెలిప్యాడ్ల నిర్మాణం
- సభను విజయవంతం చేయాలని నేతల పిలుపు

చిలకలూరిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజాగళంగా నామకరణం చేశారు. 300 ఎకరాల సువిశాల ప్రాంగణంలో అసాధారణ రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. బొప్పూడి వేదిగా ఎన్‌డీఏ నేతలు ప్రజాగళాన్ని వినిపించనున్నారు. సభకు మూడు పార్టీల కార్యకర్తలు, నేతలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వేదిక, వీఐపీ గ్యాలరీ, వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానుండటంతో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రాంగణం అంతా బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఎస్‌పీజీ నిఘాలో సభావేదిక, హెలిప్యాడ్ల నిర్మాణం జరుగుతుంది. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేక హెలికాప్టర్లలో సభా ప్రాంగణానికి రానున్నారు. దీంతో వీరి కోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్ల నిర్మాణాలు చేపట్టారు. సభకు వచ్చే లక్షలాది మందికి అవసరమైన భోజనం, తాగునీరు వంటి సౌకర్యాలను సమకూరుస్తున్నారు. ఆయా ఏర్పాట్లను సదరు కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి.

పనులను పరిశీలించిన నేతలు

సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, ఉండవల్లి శ్రీదేవి, టీడీపీ, జనసేన నాయకులు టీడీ జనార్ధన్, నన్నపనేని రాజకుమారి, కొమ్మారెడ్డి పట్టాభిరాం, కళ్యాణం శివశ్రీనివాస్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీ మాగంటి బాబు తదతర నేతలు పరిశీలించారు.



వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

అత్యవసర వైద్యానికి ఏర్పాట్లు

మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ముఖ్య నేతలు సభకు వస్తున్న సందర్భంగా అవసరమైతే అత్యవసర వైద్య సదుపాయం కోసం చిలకలూరిపేటలోని కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సిద్ధం చేశారు. వైద్యశాఖ, ఎస్‌పీజీ అధికారులు సభా ప్రాంగణం నుంచి ఆస్పత్రి వరకు శుక్రవారం ట్రయిల్ రన్ చేశారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కొమ్మినేని వీరశంకర్‌తో మాట్లాడారు. శని, ఆదివారాల్లో ఆస్పత్రిలో కొన్ని ప్రత్యేక రూములను ఏర్పాటు చేసి ఉంచాలని కోరారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు

రాష్ట్ర భవిష్యత్ కోసమే మూడు పార్టీలు పొత్తుపెట్టుకున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు పొత్తును ఆశీర్వదించాలన్నారు. మూడు పార్టీల ఆధ్వర్యంలో మొద టిసారి బొప్పూడిలో జరిగే ప్రజాగళం సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారంతా ప్రజాగళం సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, బీజేపీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. పాతూరి నాగభూషణం మాట్లాడుతూ ప్రజాగళం సభ వైసీపీకి విషగర ళంగా మారుతుందన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ప్రజాస్వా మ్య పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నార న్నారు. పండుగ వాతావరణంలో జరిగే ప్రజా గళం సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

సభకు బస్సులు కావాలి

- ఆర్టీసీ అధికారులకు టీడీపీ నేతల వినతులు
- బస్సుల ఏర్పాటులో తటపటాయిస్తోన్న అధికారులు

గుంటూరు: ఎన్‌డీఏ ఆధ్వర్యంలో బొప్పూడిలో జరిగే ప్రజాగళం సభ కోసం జనసమీకరణకు ఆర్టీసీ బస్సులు కావాలని టీడీపీ నేతల నుంచి ఆర్టీసీ అధికారులకు విజ్ఞాపనలు వస్తున్నాయి. తమకు 17న సభకు బస్సులు కావాలని ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల బరిలో నిలిచిన టీడీపీ అభ్యర్థులు కోరినట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. పొన్నూరు, మంగళగిరి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల నుంచి ఇప్పటికే 70 నుంచి 90 బస్సుల వరకు కోరినట్లు సమాచారం. పల్నాడు నియోజకవర్గం నుంచి అత్యధిక స్థాయిలో బస్సులు కావాలని కోరినట్లు తెలిసింది. అయితే బస్సుల ప్రతిపాదనలపై తమకు నివేదించాలని జిల్లా అధికారులకు ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీంతో డిపో అధికారులు తమకు వచ్చిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించే పనిలో ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సులు కేటాయిస్తామని ఇన్‌చార్జి డీపీటీవో నర్రా శ్రీనివాసరావు తెలిపారు. అయితే వైసీపీ నేతలు అడిగిందే తడవుగా బస్సులు సమకూరుస్తోన్న అధికారులు ఉమ్మడి సభకు సంబంధించి బస్సుల ఏర్పాటులో తటపటాయిస్తోన్నారన్న విమర్శలున్నాయి.




సిద్ధమవుతున్న హెలీప్యాడ్‌లు




సభా ప్రాంగణం

ఈ-కేవైసీలపై ఒత్తిడి



- అర్ధరాత్రీ సంక్షేమ లేఖల పంపిణీ
- సచివాలయ ఉద్యోగుల అనధికార వాడకం
- కోడ్‌తో శనివారంకల్లా పూర్తి చేసి..
- ఆ తర్వాతే ఇళ్లకెళ్లాలని హుకుం
- ఉన్నతాధికారుల అదేశాలతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పరుగులు
- ఒక్కో ఉద్యోగికి ముగ్గురు వలంటీర్లు..
- ఒక్కో వలంటీర్‌కు ఐదు కుంటుంబాల బాధ్యత

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలన్నింటికీ ఈ-కేవైసీ చేయించాలి. ముఖ్యమంత్రి పేరుతో ప్రతి లబ్ధిదారుడి పేరుతో వచ్చే లేఖను వారికిచ్చి అది కూడా ఈకేవైసీ చేయించాలి. ఈ మొత్తం వ్యవహారం కోడ్ వచ్చే లోపు.. అంటే శనివారం మధ్యాహ్నానికల్లా పూర్తి చేయాలి. ఆ తర్వాతే ఇళ్లకు వెళ్లాలి. అర్థరాత్రి అయినా.. అపరాత్రి అయినా ఆ పని పూర్తి చేయా ల్సిందే..' అని సచివాలయ ఉద్యోగులపై ఉన్నతాధి కారుల అదేశాలు. ఉద్యోగులు, వలంటీర్ల గ్రూపుల్లో ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ అధికారులు వారిని పరుగులు పెట్టిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న వార్త తెలియగానే వారిపై ఇప్పటి వరకూ ఉన్న ఒత్తిడి తారస్థాయికి చేరింది. దీంతో ఒత్తిడి భరించలేని ఉద్యోగులు లబ్ధిదారుల వేటలో పడ్డారు. ఆఫీసులు వదిలి వలంటీర్లను వెంటబెట్టుకుని శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు రోడ్లవెంట తిరు గుతున్నారు. సచివాలయ ఉద్యోగులను సొంత కార్యక్రమాలకు అడ్డగోలుగా వాడేస్తోందనడానికి ఇదో ఉదాహరణ. ఎన్నికలు సమీపించే కొద్దీ వారిపై విపరీతంగా ప్రభుత్వం ఒత్తిడి పెంచింది. గత నెల రోజులుగా సచివాలయ విధులతోపాటు ఈ- కేవైసీల పేరుతో వారిపై మోయలేని భారం మోపింది. కేవలం వలంటీర్లకే పరిమితమైన ఈ-కేవైసీ లాగిన్లను సచివాలయ ఉద్యోగులకు కూడా కేటాయించి వారిని కూడా వీధుల వెంట తిప్పుతోంది. 'హెచ్‌సీఎం లెటర్' పంపిణీ చేసి లబ్ధిదారుల వేలిముద్రతో ఈ- కేవైసీ చేయించేందుకు ఒక్కో సచివాలయ ఉద్యోగికి ముగ్గురు వలంటీర్ల బాధ్యత అప్పగించారు. వారితోపాటు సచివాలయ ఉద్యోగులు కూడా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ-కేవైసీ లోగుట్టు ఒక్కో వలంటీరుకు ఐదు కుటుంబాల ఓట్లను ఖాయం చేయడమేనని సమాచారం. ఇందుకోసం రహస్య సమావేశాలు పెట్టి అధికారపార్టీ నేతలు మౌఖిక ఆదేశాలు కూడా జారీ చేశారు. వారిని సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులకే అప్పగించారు.




సచివాలయ ఉద్యోగులకు అందిన వాట్సాప్ సందేశాల స్ర్కీన్‌షార్ట్స్..

కోడ్ కోసం ఎదురుచూపులు

ఈ-కేవైసీపీ భారం, అధికార పార్టీ నేతల ఆదేశాల నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు సతమతమవుతున్నారు. ఈ ఒత్తిడి నుంచి బయటపడే మార్గం లేక శారీరకంగా, మానసికంగా కూడా కుంగిపోతున్నట్లు పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. మార్చి నెల మొదలైననాటి నుంచి ఎన్నికల కోడ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే కోడ్ అమలులోకి వస్తుంది.. అధికారులు, అధికార పార్టీ నేతల ఒత్తిడి తగ్గుతుందని వారు ఆశపడ్డారు. నోటిఫికేషన్ జాప్యం జరిగేకొద్దీ వారు కుంగిపోతున్నారు. శనివారం నుంచైన కోడ్ అమలులోకి వస్తే ఊపిరి పీల్చుకోవచ్చని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఊరట దక్కేనా?

- భారీ రాయితీతో గృహ సౌర విద్యుత్ ప్లాంట్లకు ప్రోత్సాహం
- ఐదేళ్లలో 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- భారం మోయలేక కుదేలవుతున్న సామాన్య జనం
- విద్యుత్ భారం తగ్గించే దిశగా కేంద్రం అడుగులు
- పీఎం సూర్యఘర్ పేరిట 300 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం



గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడు భరించలేక సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఠారెత్తిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఎనిమిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై మోయలేని భారం వేసింది. చార్జీల పెంపుతోపాటు సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరుతో మరింత భారం మోపింది. ఫలితంగా నెలసరి విద్యుత్ బిల్లు దాదాపు 10 రెట్లు పెరిగింది. గతంలో 200, 300 రూపాయలతో పోయే బిల్లు ప్రస్తుతం 2 నుంచి 3 వేలకు పెరిగింది. దీంతో వారు అల్లాడిపోతున్నారు. దానికితోడు అధిక విద్యుత్ వినియోగం పేరుతో సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం అడ్డగోలుగా కోతలు పెడుతోంది. దీంతో ఏం చేయాలో కూడా తెలియని స్థితిలో అల్లాడిపోతున్నారు. సరిగ్గా అలాంటి సమయంలోనే కేంద్రం ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ప్రతి ఇంటికీ నెలకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పొందే అవకాశాన్ని కల్పించేలా కొత్త పథకాన్ని రూపొం దించింది. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) పథకాన్ని రూపొందించింది.

కర్బన ఉద్గారాల తగ్గింపు దిశగా అడుగులు

ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా సామాన్యులపై విద్యుత్ బిల్లుల భారం భారీగా తగ్గుతుంది. ఈ ప్లాంట్ల ద్వారా తయారయ్యే విద్యుత్‌ను సొంత అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌ల ద్వారా కొనుగోలు చేస్తారు. మిగులు విద్యుత్ ధర డిస్కమ్‌లే వినియోగదారులకు చెల్లిస్తాయి. తద్వారా లబ్ధిదారులు ఆదాయం కూడా పొందవచ్చని కేంద్రం చెబుతోంది. 3 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంటు ద్వారా సగటున ప్రతి నెలా 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. ఇలా 25 ఏళ్ల వరకూ ఆ ప్లాంటు పనిచేస్తుంది. అందులో 200 యూనిట్లు వాడుకున్నామనుకుంటే, మిగిలిన వంద యూనిట్ల ను డిస్కమ్ కొనుగోలు చేసి లబ్ధిదారులకు నగదు చెల్లిస్తుంది. ప్లాంటు ఏర్పాటుకు ఎంత ఖర్చవు తుంది. సబ్సిడీ ఎంత వస్తుంది. అదిపోను లబ్ధిదారు ఎంత పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. పెట్టిన పెట్టుబడి ఎన్నేళ్లలో తిరిగి వస్తుంది. ఆ తరువాత మిగిలిన ఏళ్లలో వచ్చే రిటర్న్(లాభం) ఎంత ఉంటుంది. 25 ఏళ్లలో ఎన్ని టన్నుల కార్బన ఉద్గారాలను తగ్గించామో తెలుసుకునేందుకు వీలుగా పోర్టల్‌లోనే ప్రభుత్వం కాలిక్యులేటర్‌ను ఏర్పాటు చేసింది. ఇలా అన్ని అంశాలు ఒకే చోట ఉండేలా పోర్టల్‌ని అధికారులు రూపొందించారు.

ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారం భమయింది. తొలుత 'పీఎంసూర్యఘర్.జీవోవీ.ఇన్' పోర్టల్‌లో లబ్ధిదారు పేరు రిజిస్టర్ చేసుకోవాలి. అందుకోసం రాష్ట్రం పేరు, విద్యుత్ సరఫరా చేసే సంస్థ(డిస్కమ్) పేరును ఎంచుకోవాలి. విద్యుత్ కనెక్షన్ కన్జూమర్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీలను ఎంటర్ చేయాలి. తద్వారా రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత వినియోగదారు రిజిస్టర్ చేసిన మొబైల్ నెంబర్‌తో లాగిన్ చేయాలి. అక్కడే రూఫ్‌టాప్ సోలార్ కోసం అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. దర ఖాస్తులో అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి. గడిచిన ఆరునెలల్లో వచ్చిన ఏదైనా ఒక కరెంటు బిల్లు ఫోటో అప్‌లోడ్ చేయాలి. ప్లాంట్ లోకేషన్‌ను గూగుల్ మ్యాప్‌లో ఎంపిక చేయాలి. ఆ తరువాత అప్లికేషన్‌ను సేవ్ చేసి సబ్‌మిట్ చేయాలి. అప్లికేషన్ సబ్‌మిట్ చేసిన తరువాత డిస్కమ్ అనుమతులు వచ్చేవరకు ఎదురు చూడాలి. అనుమతి లేదా తిరస్క రణకు 15 రోజుల సమయం పడుతుంది. అనుమతి వచ్చాక లబ్ధిదారుడికి సంబంధించిన డిస్కమ్‌లో నమోదైన విక్రేతల ద్వారా సోలార్ ప్లాంట్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ప్లాంట్ ఇన్‌స్టాలేషన్ పూర్తయ్యాక.. ఆ ప్లాంట్ వివరాల్ని పోర్టల్ లో సమర్పించి నెట్ మీటర్ కోసం అప్లై చేసుకోవాలి. నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత.. డిస్కమ్ అధి కారులు తనిఖీలు చేస్తారు. తర్వాత పోర్టల్ నుంచి కమిష నింగ్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ రిపోర్టు పొందాక మీ బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ సహా క్యాన్సిల్ చేసిన చెక్‌ను పోర్టల్‌లో సబ్మిట్ చేస్తే.. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.

తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా..

గతంలో ప్రధానమంత్రి సూర్యోదయ యోజన కింద అమలు జరిగిన ఈ పథకానికి ఒక్కో కిలోవాట్‌కు రూ.18000 చొప్పున సబ్సిడీ ఇచ్చారు. అలా ఒక్క కిలోవాట్ ప్లాంటుకు రూ.18వేలు, 2 కిలోవాట్ల ప్లాంట్లకు రూ.36వేలు, 3 కిలోవాట్ల ప్లాంట్లకు రూ.54వేలు సబ్సిడీ ఇచ్చారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేదు. ఫలితంగా సబ్సిడీని కేంద్రం అమాంతం పెంచింది. అయినప్పటికీ ప్రజలు ముందుకు వస్తారా? లేదా అన్నది అనుమానంగానే వుంది. రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఇన్‌స్టాల్ చేయడం ఖర్చుతో కూడుకున్న అంశం కావడమే అందుకు కారణం. ఈ సమస్యను కూడా అధిగమించేందుకు స్వయంగా ప్రభుత్వమే రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తోంది. బ్యాంకుల ద్వారా 7 నుంచి 12 శాతం అతి తక్కువ వడ్డీతో ప్లాంటు ఖర్చులో 90 శాతం రుణ రూపంలో అందించేందుకు అవకాశం కల్పిస్తోంది. 2నుంచి 10 ఏళ్ల కాల పరిమితితో ఈ రుణాలు అందించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రూ.78,000 వరకు సబ్సిడీ

ఈ పథకం కింద గృహ వినియోగానికి సంబంధించి ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లలో 2 కిలోవాట్ల వరకూ మొత్తం ఖర్చులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం అందిస్తుంది. 2 నుంచి 3 కిలోవాట్ల ప్లాంట్లకు 40 శాతం అందిస్తుంది. ఒక కిలోవాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే రూ.30,000, 2 కిలోవాట్ల ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే రూ.60వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తుంది. 3 కిలోవాట్ల ప్లాంటును ఏర్పాటు చేసుకుంటే రూ. 78వేలు సబ్సిడీ కింద అందిస్తారు.

కేంద్ర ప్రభుత్వం ఆమోదం

ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఫిబ్రవరి 16న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రణాళికకు ఆమోదం లభించింది. ఈ పథకం కింద దేశంలోని కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాట్లను ఏర్పాటు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.76 వేల కోట్ల వరకూ కేటాయించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా ఒక కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లకు కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో సబ్సిడీ అందించనుంది.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

ఆదాయం, అభివృద్ధి నిల్.. అప్పులు ఫుల్

● మీ రాజధాని ఎక్కడా అని అడుగుతుంటే సిగ్గేస్తుంది

● 1550వ రోజుకు అమరావతి ఉద్యమం

తుళ్లూరు, మార్చి15: రాష్ట్రానికి ఆదాయం లేదని, అభివృద్ధి అంతక కన్నా లేదని.. కానీ ఒక్కో తలమీద ఐదు లక్షల అప్పు చేశారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1550వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడారు. ఐదేళ్లలో అమరావతి రాజధానిలో తట్ట మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. మూడు రాజధానులు కడతామని సీఎం జగన్‌రెడ్డి కాలయాపన చేశారన్నారు. అమరావతిపై కక్షతో మూడు ముక్కలాటకు తెరతీశాడన్నారు. మీ రాజధాని ఎక్కడా..? అని అడుగుతుంటే సిగ్గేస్తుందన్నారు. రాజధానికి భూములు త్యాగం చేసినందుకు అవమానాలు ఎదుర్కోవల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయటం చేతకాని ముఖ్యమంత్రి మూడు రాజధానులని ప్రజలను మభ్య పెట్టారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పునైనా గౌరవించి అమరావతి అభివృద్ధిని కొనసాగించాల్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి, ఉద్దండ్రాయునిపాలెం, అనంతవరం నెక్కల్లు, వెలగపూడి తదితర రాజధాని గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

కుక్కర్ల స్వాధీనం

పెదకూరపాడు, మార్చి 15 : పోలీసుల తనిఖీల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి మండలంలోని కంభంపాడు సమీపంలో తనిఖీలు నిర్వహించారు. రెండు టాటా ఏసీల్లో రసీదులు లేని 1272 కుక్కర్లు ఉన్నట్టు ఎస్ఐ వెంకటరావు తెలిపారు. ఈ విషయమై సత్తెనపల్లి సేల్ ట్యాక్స్ వారికి సమాచారం పంపించామని ఆయన వివరించారు.

అవకాశమివ్వండి.. రుణం తీర్చుకుంటా

● పేదరికం లేని మంగళగిరి నా కల ● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, మార్చి 15: 'గత ఎన్నికల్లో కేవలం 18 రోజుల ముందు మాత్రమే మంగళగిరి వచ్చాను. ఆనాడు ఓడిపోయినా.. ఆ రోజు నుంచి ఈరోజు వరకు ఇక్కడి ప్రజల మధ్యే వుంటూ సొంత నిధులతో సేవ చేస్తున్నాను. మంగళగిరిని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దే ప్రణాళికలు నా వద్ద వున్నాయి. ఈ మారు అవకాశమిచ్చి.. ఆశీర్వదించండి. మీ రుణం తీర్చుకుంటానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరిని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని లోకేశ్ ఇచ్చిన నినాదానికి నియోజకవర్గంలోని అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వస్తోంది. వివిధ పార్టీల నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతుంది. మంగళగిరి పట్టణంలోని 16, 19, 20వ వార్డులకు చెందిన 75 కుటుంబాలు, ఆత్మకూరు గ్రామానికి చెందిన 25 కుటుంబాల వారు శుక్రవారం లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని నివాసంలో వీరందరికీ పసుపు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణానికి చెందిన కొదమల సైమన్ ఆధ్వర్యంలో జొన్నాదుల శివశంకర్, సాయిప్రసాద్, చిక్కా బాలసూర్యకుమార్, వాకా మాధవ్‌తోపాటు 70 కుటుంబాలు, బట్టు చిదానందశాస్త్రి, చెల్లూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేమూరి మోహన్, కంభంపాటి చందు, కుంపటి ప్రేమ్‌కుమార్, వేమూరి ప్రభుదాస్‌తోపాటు మరో 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరిలో వరుసగా రెండుమార్లు వైసీపీని గెలిపించినా కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదన్నారు. తాను చిరువ్యాపారులకు నాలుగేళ్లుగా వివిధ రకాల బండ్లు అందిస్తుంటే.. ఎన్నికల వేళ వైసీపీ నేతలు హడావిడిగా పంపకాలు చేస్తున్నారని విమర్శించారు. యువగళం పాదయాత్ర చేస్తున్న సమయంలో కూడా తన మనసంతా మంగళగిరిలోనే వుందన్నారు. చంద్రబాబు జయహో బీసీ సభలో హామీ ఇవ్వగానే ఇప్పుడు యూ-1 జోన్ ఎత్తివేశారని చెప్పారు. మరో రెండు నెలల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు 20 వేల పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూముల్లో నివాసం వుంటున్న వారికి పట్టాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. రెండుసార్లు ఆళ్ల రామకృష్ణారెడ్డిని గెలిపించారు.. కానీ, ఆయన ఇల్లు ఎక్కడుందో ఎవరికీ తెలీదు. నేను ఉండవల్లిలోనే వుంటా. మా ఇంటి తలుపులు ఎప్పుడూ తీసే వుంటాయి. మన నాయకులు కూడా అందుబాటులో వుంటారని తెలిపారు. బులుగు బటన్ నొక్కి రూ.పది అకౌంట్‌లో వేసి.. ఎర్ర బటన్ ద్వారా రూ.వంద కొట్టేయడం జగన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు దామర్ల రాజు, తోట పార్థసారధి, ప్రధాన కార్యదర్శులు షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్, పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, మాజీ కౌన్సిలరు రంగిశెట్టి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన నేతలు, కార్యకర్తలతో కలిసి లోకేశ్ అభివాదం

టీడీపీని గెలిపిద్దాం.. అభివృద్ధిని సాధిద్దాం

● ప్రజల కోసం నిలబడే వ్యక్తి బ్రహ్మారెడ్డి

● మాచర్లలో 100 పడకల ఆసుపత్రి తీసుకొస్తాం

● టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు



శ్రీకృష్ణ దేవరాయలు, బ్రహ్మారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

దుర్గి, మార్చి 15: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడపాలంటే తెలుగుదేశాన్ని గెలిపించుకోవాలని టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. శుక్రవారం దుర్గిలో ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లుగా తాను ఎంపీగా ఉన్నానని, పల్నాడు అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశానని అన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ తీసుకొచ్చేందుకు పార్లమెంట్‌లో ఎంతగానో శ్రమించానని గుర్తు చేశారు. తనను మరోమారు గెలిపిస్తే వరికపూడిశెలను పల్నాడు ప్రాంత ప్రజలకు అందించడంతోపాటు గోదావరి జలాలను నాగార్జున సాగర్‌లో కలిపి తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిలబడే వ్యక్తి జూలకంటి బ్రహ్మారెడ్డి అని, కార్యకర్తల బాగోగుల కోసం ఎంతటి పోరాటమైనా చేయగల వ్యక్తి అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మాచర్లలో వంద పడకల ఆసుపత్రి తీసుకొస్తామని చెప్పారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు స్వేచ్ఛ లేదని, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఏ శుభకార్యం చేయాలన్నా అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. నియోజకవర్గంలో తాగునీటిని కంటే మద్యం అందించడంలో గుడుంబా శంకర్ స్థానిక ఎమ్మెల్యే పీఆర్కే తన మార్కును చాటుకున్నారన్నారు. అన్నాతమ్ముళ్లు తమ సంపాదనే నియోజకవర్గాన్ని ఉపయోగించుకున్నారని, అక్రమ మద్యం, గ్రానైట్, గంజాయి, బోడు భూములు అని తేడా లేకుండా విచ్చలవిడిగా వినియోగించుకొని కోట్లాది రూపాయలు సంపాదించారాన్నరు. జనసేన నేతల కృషి ఎనలేనిదని, వారిని చూసి టీడీపీ నేతలు నేర్చుకోవాల్సింది చాలా ఉందని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి చిరుమామిళ్ల మధుబాబు మాట్లాడుతూ దుర్గి మండలం టీడీపీకి కంచుకోటని, గతంలో టీడీపీకి 16 వేలు మెజార్టీ వచ్చిన సందర్భం కూడా ఉందని అన్నారు. నేతల మధ్య సమన్వయలోపం కనిపిస్తోందని, వాటిని సరిచేసికొని మరలా ఒకతాటిపై రావాల్సిన బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఉందన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మారెడ్డి, మధుబాబులను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఘనంగా స్వాగతించి గజమాలతో సన్మానించారు. అనంతరం 30 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, జనసేన నేతలు పులి హరి, తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, బూసా రామాంజినేయులు, బీమా అమరయ్య, సూరె బాల సుబ్బారావు, భవన్నారాయణ, కొప్పుల వెంకటరమణ, రుద్రాల రమాదేవి, బీజేపీ నేతలు వెలిదండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య విధానంలో సంస్కరణలు

● డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జి



ఏఎన్‌యూలో జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ బాబ్జీ, వీసీ రాజశేఖర్ తదితరులు

గుంటూరు, మార్చి 15: రాష్ట్ర వైద్య విధానంలో విప్లవాత్మక సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే.బాబ్జి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై మూడురోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సదస్సుకు డాక్టర్ బట్టు నాగరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా డాక్టర్ బాబ్జి హాజరై సంక్రమణ వ్యాధులను వైద్యరంగం సమర్థంగా ఎదుర్కొంటూనే అసంక్రమణ వ్యాధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ ఏడాది నుంచి ఎండీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ హెల్త్‌కేర్ వ్యాపారం రానున్న కాలంలో బహుముఖంగా విస్తరించి ఉందని పేర్కొన్నారు. అలాగే కృత్రిమ మేధస్సు శరవేగంగా విస్తృతి చెందుతుందని అది వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులతో పాటు అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీవెంకటేశ్వర హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వాడుకోని రంగమే నేడు లేదని పారిశ్రామిక వ్యాపార రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో పెనవేసుకున్నాయని పేర్కొన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు దేశం నలుమూలల నుండి 140 పరిశోధన పత్రాలు వచ్చాయని వివరించారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూప రాణి, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్, భోపాల్‌లోని ఎయిమ్స్ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, మంగళగిరి ఎయిమ్స్ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్, వివిధ దేశాల నుంచి పలువురు పరిశోధకులు ఎంబీఏ హాస్పిటల్ విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ సాదిక్ సయ్యద్, డాక్టర్ బి.శ్రీధర్ రెడ్డి, డాక్టర్ చుండీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుర్గి, మార్చి 15: మండల కేంద్రమైన దుర్గి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో మండలంలోని గజాపురంకు చెందిన మూడావత్ సోమ్లానాయక్(35) మృతిచెందారు. గ్రామానికి చెందిన సోమ్లానాయక్ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. శుక్రవారం గోతాలు కోసం దుర్గి గ్రామానికి వచ్చి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నాడు. దుర్గి శివారులోని పెట్రోల్ బంక్ వద్ద ముందుగా వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన సోమ్లానాయక్‌ను 108 అంబులెన్స్ మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. దీనిపై ఎస్ఐ కోటయ్య కేసు నమోదు చేశారు.

మాచర్లలో చోరీ.. ఆభరణాల అపహరణ

మాచర్ల రూరల్, మార్చి15: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల ఓ గృహంలో చోరీ జరిగింది. ఆ ప్రాంతంలో నివాసముంటున్న భార్యభర్తలు బాలయ్య, పుల్లమ్మ రోజూ రాత్రి సమయంలో తమ కోడళ్ల నివాసముంటున్న పీడబ్ల్యూడీ కాలనీకి వెళ్తుంటారు. రోజు మాదిరిగా గురువారం రాత్రి కూడా వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి తలుపుల తాళాలు పగులకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా పగుల కొట్టి రూ.2.50 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలతోపాటు రూ.20 వేలు నగదు, సెల్‌ఫోన్ అపహరణకు గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నెల రోజులు నాకోసం కష్టపడండి

● ఐదు సంవత్సరాలు సేవ చేస్తా ● పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్



సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

అమరావతి, మార్చి 15: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నెలరోజులు కష్టపడి ఎమ్మెల్యేగా గెలిపిస్తే రానున్న ఐదు సంవత్సరాలు సేవకుడిగా, రక్షకుడిగా సేవలు అందిస్తానని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం ఆయన వైకుంఠపురం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అక్రమ అరెస్టుల బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అధికారంలోకి రాగానే ఒక్క ఫోన్‌కాల్‌తో పోలీసుస్టేషన్, రెవెన్యూ కార్యాలయంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే శంకరరావును ఇంటికి పంపించే వరకు విశ్రమించనని అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి ఆశీస్సులతోనే ఎన్నికల బరిలో నిలబడటం జరిగిందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి శ్రీధర్ చేసిన కృషి అభినందనీయం అన్నారు. సమావేశంలో పాల్గొన్న టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ కూటమి భారీ మెజారిటీతో అధికారంలోకి రాబోతుందని అన్నారు. పార్టీ నాయకుల ఆశీస్సులతో యువతకు అవకాశం ఇవ్వాలన్న ఆలోచనతో ప్రవీణ్‌కు సీటు కేటాయించడం జరిగిందని అన్నారు. నియోజకవర్గంలోని మూడు పార్టీల నాయకులు సమష్టిగా పోరాడి ప్రవీణ్ గెలుపునకు కృషి చేసి భారీ మెజారిటీతో చంద్రబాబునాయుడుకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఐదు మండలాల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొని ప్రసంగించారు.

మిర్చి వ్యాపారి అదృశ్యం

● రూ. 5 కోట్ల మేరకు రైతులకు బకాయి

● శుక్రవారం సాయంత్రం నుంచి ఫోన్ స్విచ్ఆఫ్

● తీవ్ర ఆవేదన చెందుతున్న రైతులు, ట్రేడర్లు

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చి కమీషన్ వ్యాపారి ఒకరు రైతులను నిలువునా ముంచాడు. హఠాత్తుగా శుక్రవారం కనిపించకుండా పోయాడు. తాను ఫలాన వ్యక్తులు, ఫరంలకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, వాటిని తన ఆస్తి అమ్మి ఇవ్వాల్సిందిగా ఒక లేఖ విడుదల చేశారు. దాంతో అతనికి మిర్చి విక్రయించిన రైతులు లబోదిబోమంటున్నారు. దాదాపుగా రూ.5 కోట్ల మేరకు రైతులకు, వేరే సంస్థలకు అప్పు చెల్లించాల్సి ఉందని దిగుమతి వ్యాపారస్థులు అంచనా వేస్తున్నారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో చాముండేశ్వరి ట్రేడర్స్ అనే కమీషన్ (దిగుమతి) కొట్టు ఉంది. దీనికి తోట ఉదయచంద్రరావు అనే వ్యక్తి మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. ఈ సీజన్‌లో చాలామంది రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేసి వారికి బకాయిలు చెల్లించలేదు. దీంతో కొద్ది రోజులగా రైతులు ఆ దుకాణం చుట్టూ తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయచంద్రరావు కనిపించకుండాపోయి తన సంతకంతో ఒక లేఖని విడుదల చేశారు. టి.సుధారాణి, చంద్రశేఖర్, వేణు నన్ను క్షమించమంటూ లేఖ రాశారు. తాను కొన్ని అప్పులు చేసిన కారణంగా ఇల్లు వదిలి వెళ్లిపోతున్నానని అందులో పేర్కొంటూ ఈ అప్పులకు తన భార్య, పిల్లలకు సంబంధం లేదన్నారు. తన పార్టనర్ టి.రాంబాబుకు కూడా ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఈ లేఖ శుక్రవారం సాయంత్రం యార్డులో వెలుగులోకి రావడంతో ఉదయచంద్రరావుకు మిర్చి సరుకు అమ్మిన వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యార్డు సూపర్‌వైజర్ పర్యవేక్షణ లోపం వలనే ఇదంతా జరిగిందని ఆరోపిస్తున్నారు. మిర్చియార్డులో ఏటా ముగ్గురు, నలుగురు దిగుమతి వ్యాపారస్థులు ఇలా రైతులను నిలువునా మోసం చేయడం సర్వసాధారణంగా మారిపోయింది.

జిల్లా పరిషత్‌లో పదోన్నతులు



పదోన్నతులు పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టీనా

గుంటూరు సిటీ, మార్చి 15: గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు పదోన్నతులు దక్కాయి. శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులను అందజేశారు. సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తన్నీరు శ్రీనివాసరావు, బాపట్లలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లావణ్యలు పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. వీరిని అడ్మినిస్ట్రేటివ్ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. బ్యాక్‌లాగ్ పోస్టుల్లో ఉద్యోగం సాధించిన నవ్యశ్రీకి జాగర్లమూడి మండల పరిషత్ కార్యాలయంలో రాత్రి కాపలాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మోహన్‌రావు, పూర్ణ చంద్రారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

1,12,364 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 1,15,599 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,32,064 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 77,285 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	19500
నెంబరు 5	12000	17000
273	10000	15000
341	9000	19500
4884	12000	15000
సూపర్ 10	13500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10000	19000
దేవనూరుడీలక్స్	10000	19000
తెల్లకాయలు	5000	12500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

రూ.1.48 కోట్ల నకిలీ పురుగు మందులు స్వాధీనం



పేరేచర్లలో స్వాధీనం చేసుకున్న నకిలీ పురుగు మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరావు

మేడికొండూరు/గుంటూరు సిటీ, మార్చి 15: గుంటూరు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మేడికొండూరు మండలం పేరేచర్లలో నకిలీ పురుగు మందుల గుట్టు రట్టయింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించి రూ.1.48 కోట్ల విలువ చేసే నకిలీ పురుగు మందులను పట్టుకున్నారు. స్థానికంగా ఉన్న నికిత కిసాన్ సేవా కేంద్రంలో నకిలీ మందులు తయారు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. తనిఖీకి వెళ్లిన అధికారులు అక్కడ ఉన్న సేంద్రియ పురుగు మందుల తయారీకి వినియోగించే భారీ ముడిపదార్థాలు చూసి నివ్వెరపో యారు. ఒక్క వ్యాపారి వద్దే రూ.1.48 కోట్ల విలువ చేసే ముడి పదార్థాలు దొరకడంతో లోతైన విచారణ చేపట్టారు. ఏ విధమైన ఇన్వాయిసులు, బిల్లులు లేకుండా శివప్రసాద్ అనే వ్యక్తి సేంద్రియ ఉత్పత్తులు పేరిట నకిలీ పురుగు మందులు తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యాపారికి పురుగు మందులు, ఎరువులు అమ్మేందుకు మాత్రమే అనుమతి ఉన్నట్లు తేల్చారు. సుమారు ఐదురకాల సేంద్రియ ముడి పదార్థాలను కనుగొన్నారు. నకిలీ పురుగు మందుల కోసం నిల్వవుంచిన సేంద్రియ ముడి పదార్థాల విలువ రూ.1.48 కోట్లు ఉంటుందని విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరావు తెలిపారు. వ్యాపారిపై మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో సెక్షన్ 420 కింద క్రిమినల్ కేసు నమోదు చేయవలసినదిగా స్థానిక వ్యవసాయ అధికారి ఫిర్యాదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ కె.రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామ చంద్రయ్య, స్థానిక వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మారెడ్డి తదితరులు

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించలేకపోయారు

● నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, మార్చి 15 : నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించలేకపోతున్నావే.. దౌర్జన్యం, దోపిడి, ఇసుక, మద్యం, గ్రానైట్ లారీలు తరలించి అక్రమంగా కోట్లు గడించే నీవా నన్ను విమర్శించేది అని ఎమ్మెల్యే పీఆర్కేపై టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెంటచింతలలో రెండు చోట్ల పార్టీ కార్యాలయాలను శుక్రవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎన్నికల ప్రచార రథంపై నుంచి రాగా వారికి అభిమానులు గజమాలలు వేశారు. అనంతరం స్టేషన్ రోడ్డులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచినీళ్లు అడిగితే టెంకాయలు కొట్టి ప్రమాణం చేయమనే నీకు టైం దగ్గరపడిందన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ బ్రహారెడ్డి కార్యకర్తలకు రక్షణగా నిలుస్తున్నారని, తాను అభివృద్ధిని చూసుకుని పల్నాడును సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతానని హామీనిచ్చారు. తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మారెడ్డి గెలుపు ఖాయమైందన్నారు. గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల వారు చితికిపోయారన్నారు. రెంటచింతల, రెంటాల, గోలి, మల్లవరం తదితర గ్రామాలకు చెందిన 127 మంది వైసీపీని వీడి టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, కాయితి రవి, టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, ఆదిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ నాగమ్మ నర్సిరెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, మాజీ డీసీ చైర్మన్ నల్లబిరుదు నరశింహారావు, దళిత నేత రవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

దుర్గి, మార్చి 15: మండలంలోని ఓబులేశునిపల్లెకు చెందిన సుమారు 20 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వెల్దుర్తిలోని తన స్వగృహంలో వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గుండాల మంగయ్య ఆధ్వర్యాన ఈ చేరికలు జరిగాయి. కార్యక్రమంలో లాకా శివయ్య, గుండాల నాగేంద్రరాజు, గుమ్మా వెంకటేశ్వర్లు, ఆవుల సుబ్బయ్య, చిరుమామిళ్ల రామారావు, ఉన్నం నరసింహం పాల్గొన్నారు.

కారంపూడిలో...

కారంపూడి, మార్చి 15: మండలంలోని ఒప్పిచర్లలో గల వెంకటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి వైసీపీ నేతలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిలు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్య నేతలైన చిరుమామిళ్ల బుచ్చయ్య చౌదరి, శ్రీనివాసరావు, రెడ్డిపాలెం శ్రీనులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, కుర్రి శివారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు తుపాలకు చినరత్తయ్య, బీసీ సెల్ మండల కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, మాజీ ఉప ఎంపీపీ పంగులూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భాష్యం ప్రవీణ్‌కు ఘనస్వాగతం

అమరావతి, మార్చి 15 : పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా సీటు పొందిన తరువాత తొలిసారిగా అమరావతి మండలానికి వచ్చిన భాష్యం ప్రవీణ్‌కు 14వ మైలు సెంటర్ నుంచి ఐదు మండలాల టీడీపీ, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. ర్యాలీలో పాల్గొన్న ప్రవీణ్‌కు గజమాల వేసి తమ అభిమానం చాటుకున్నారు. వందల సంఖ్యలో కార్ల ర్యాలీతో తన స్వగ్రామమైన పెదపరిమి నుంచి తన అనుచరులతో బయలు దేరిన ప్రవీణ్‌కు నియోజకవర్గం లోకి అడుగు పెట్టగానే భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు చేరుకుని వైకుంఠపురం వరకు ర్యాలీగా వచ్చారు. మార్గమధ్యలో లేమల్లె వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ర్యాలీలో భారీ గజమాలతో భాష్యం ప్రవీణ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

ప్రవీణ్‌కు అభినందనలు తెలిపిన కన్నా

అమరావతి, మార్చి 15 : టీడీపీ అభ్యర్థిగా సీటు పొంది వైకుంఠపురంలో ప్రత్యేక పూజల కోసం వచ్చిన భాష్యం ప్రవీణ్‌కు మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపి తన ఆశీస్సులు ఉంటాయని ప్రకటించారు. ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించి ప్రవీణ్‌ను అభినందించి వెళ్లారు. కన్నా వెంట టీడీపీ నాయకులతో పాటు కాపునాడు జిల్లా అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

మామను ఇంటికి.. అల్లుడుని అసెంబ్లీకి పంపిస్తాం : జనసేన

అమరావతి, మార్చి 15: రానున్న ఎన్నికలలో వైసీపీ, టీడీపీ నుంచి మామా అల్లుళ్లు బరిలో ఉంటున్న తరుణంలో మామను ఇంటికి పంపి, అల్లుడుని అసెంబ్లీకి పంపిస్తామని జనసేన నాయకులు ప్రకటించారు. శుక్రవారం వైకుంఠపురంలో భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు ప్రసంగించారు. వారిలో జనసేన నాయకులు ప్రసంగిస్తూ ప్రవీణ్‌ను అధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామని ప్రకటించారు.

పెదకూరపాడులో టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ప్రచారం

పెదకూరపాడు, మార్చి 15 : టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ గృహానికి వచ్చారు. మండలంలోని పార్టీ ముఖ్య నేతలను, కార్యకర్తలను ప్రవీణ్‌కు రమేష్ పరిచయం చేశారు. ప్రతి ఒక్కరు టీడీపీ విజయానికి కృషి చేయాలని ప్రవీణ్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. అనంతరం గ్రామంలోని పలు గృహాలకు వెళ్ళి ప్రచారాన్ని నిర్వహించి టీడీపీని గెలిపించాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం అంజనేయులు, టీడీపీ మండల నేతలు ఏటుకూరి బ్రహ్మయ్య, టీడీపీ జిల్లా నాయకులు షేక్ ముంతాజ్, గంగినేని లీలావతి, మండల నేతలు తదితరులు ఉన్నారు. ముందుగా అబ్బరాజుపాలెం గ్రామంలోని వినాయకుని దేవాలయంలో ప్రవీణ్ పూజలు నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎంపీ లావు, యరపతినేని

దాచేపల్లి, మార్చి 15 : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో 20 కుటుంబాలు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను చూసి యరపతినేనిపై ఉన్న నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ద్రోణాదుల మల్లయ్య, చంద్రం, చింతల హరిబాబు, జక్కా బుడ్డ శ్రీను, టంటం పున్నయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు ఆవుల శివకృష్ణ, మామిడి చంద్రశేఖరరావు, మాజీ సర్పంచ్ శానం బుజ్జి, కిచ్చంశెట్టి పకీరయ్య, దోమ అంకారావు, సైదారావు, బుర్రి శ్రీను, జంగిలి వెంకట్రామయ్య, పోలిశెట్టి బ్రహ్మానందరావు, జక్కా సుబ్బయ్య, శానం సైదారావు, దారం కాశయ్య, సంకురాత్రి పిచ్చయ్య తేలుకుట్ల బాగయ్య, బ్రహ్మయ్య, టంటం అంజి, బండి శ్రీను పాల్గొన్నారు.

ప్రజాగళంను జయప్రదం చేయాలి

పిడుగురాళ్ల, మార్చి 15: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఆదివారం జరిగే ప్రజాగళం భారీ బహిరంగసభ విజయవంతం చేయాలని పిడుగురాళ్ల మండల పరిశీలకులు అంచుల నరసింహారావు, పచ్చల నాగేశ్వరరావులు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్లలోని గురజాల టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును కలిసిన అనంతరం పలు గ్రామాల పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గండికోట వెంకటేశ్వర్లు, సానికొమ్ము కోటిరెడ్డి, మేకల రాంబాబు, మాణిక్యరావు, మేకల మరియబాబు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

● శాలివాహన ఆత్మీయ సమావేశంలో యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 15 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని గురజాల టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పిడుగురాళ్ల ఫంక్షన్ హాలులో శుక్రవారం శాలివాహన సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీనే బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడిందన్నారు. పిడుగురాళ్లతో పాటు సంఘ నేతలు కోరిన ప్రాంతాలలో విగ్రహాల ఏర్పాటు, షాదీఖానాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. శాలివాహన సంఘ సభ్యుల కుటుంబాలలో జరిగే వివాహ వేడుకలకు అవసరమైన కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడతానని తెలిపారు. కవయిత్రి మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జమ్మిశెట్టి రామకృష్ణ, నడికూడి వెంకటేశ్వరరావు, మారపాకుల వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటేశ్వర్లు, గుమ్మడిదల సూర్యనారాయణ, అమరలింగం, మద్దిగుంట గురవయ్య, బాడిశ రవికుమార్, మస్తాన్‌రావు, కానాల వెంకటేష్, బలిజేపల్లి సాంబశివరావు, గుళ్లపల్లి అంజయ్య, మోజా శివ పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగురవేద్దాం

గురజాల నియోజకవర్గ టీడీపీ, జనసేన అభ్యర్థిగా ఏడవసారి పోటీ చేస్తున్న యరపతినేని శ్రీనివాసరావును జనసేన నేతలు శుక్రవారం కలిశారు. పార్టీ జాయింట్ కార్యదర్శి దూదేకుల ఖాశింసైదా, షేక్ మదీనా, మందా జెర్సీ, గుంటూరు సాయి, గద్దెనబోయిన సతీష్, దూదేకుల ఖాశిం, సయ్యద్ ఖాశిం, బంకా సామియేలు, దూదేకుల బాషాతో పాటు పలువురు నేతలు యరపతినేనిని కలిసి ఎన్నికలలో టీడీపీతో కలిసి ఉమ్మడి ప్రచారం చేసేందుకు సిద్ధంగా వున్నామని తెలిపారు.

చిలకలూరిపేట బహిరంగసభను జయప్రదం చేయాలి

పిడుగురాళ్ల, మార్చి 15 : చిలకలూరిపేట సమీపంలో ఆదివారం జరిగే ప్రజాగళం బహిరంగసభను జయప్రదం చేయాలని గురజాల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు నేతలతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా ఎన్నికల శంఖారావం సభకు ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు రానున్నారని తెలిపారు. గురజాల నియోజకవర్గం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. బీజేపీ నేత ఏలూరి శశికుమార్ కూడా మాట్లాడుతూ చిలకలూరిపేట సభను జయప్రదం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

కందుల పుల్లయ్య కుటుంబానికి పరామర్శ

పిడుగురాళ్ల, మార్చి 15 : పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కందుల పుల్లయ్య కుటుంబాన్ని శుక్రవారం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పరామర్శించారు. పార్టీ పుల్లయ్య కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ పుల్లయ్య చిత్రపటం వద్ద యరపతినేని శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డవల్లి సర్వేశ్వరరావు, చల్లగుండ్ల శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, ఉసిరికాయల అంకారావు, బెల్లంకొండ పూర్ణ, వడ్డవల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయాన్ని గౌరవిస్తా

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్



చంద్రబాబుతో కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, మార్చి 15 : రాష్ట్రం కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నిర్ణయాన్ని గౌరవిస్తానని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. చంద్రబాబు నాయుడు పిలుపుతో ఆయన నివాసానికి వెళ్ళి మాట్లాడినట్లు తెలిపారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నామని, ఈ సమయంలో రాష్ట్రానికి చంద్రబాబు అవసరం ఉంది గనుక ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తామని తెలిపారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

క్రోసూరు, మార్చి 15 : గీత కార్మికుల సమస్యలను పరిష్కరించటమే కాక సంక్షేమానికి పాటుపడాలని గౌడ సామాజికవర్గం నాయకులు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను కోరారు. శుక్రవారం ఆయనను కలసి వినతి పత్రం సమర్పించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు స్పందించారని, గౌడ సమాజిక వర్గం సమస్యలతో పాటు బీసీల అందరి అభివృద్ధికి, సంక్షేమానికి రక్షణ కల్పించేందుకు కొత్త చట్టం తీసుకు వస్తామని హామి ఇచ్చారు. గౌడ సామాజికవర్గం నాయకు లు మల్లాల రామాంజనేయులు, నవీన్ కుమార్, సైదారావు, శ్రీనివాస్, సుధాకర్, విజయకుమార్‌తో పాటు జిల్లా నాయకులు సైదులు, సత్తెన పల్లి, అచ్చంపేట నాయకులు జగదీష్, లక్ష్మీనారాయణ, విజయ్ ఉన్నారు.

అక్రమ విద్యుత్ వాడకంపై అపరాధ రుసుం

దాచేపల్లి మార్చి 15 : దాచేపల్లి మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి 118 మందిపై కేసులు నమోదు చేసి రూ.7.71 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఈఈ ఎ.సూర్యప్రకాష్ శుక్రవారం తెలిపారు. దాచేపల్లి మండలంలోని గామాలపాడు, కాట్రపాడు, కొత్తూరు, మాదినపాడు, పొందుగల, రామాపురం, శ్రీనగర్, ఇరికేపల్లి, భట్రుపాలెం, తంగెడ గ్రామాలలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో డిఇఇ రవికుమార్, వీరేశ్వరరావు, ఎఇలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, డి.నాగేశ్వరరావు, తదితరులున్నారు.

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేయాలి : యూటీఎఫ్

పిడుగురాళ్ల, మార్చి 15 : ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్ కుమార్, విజయసారథి తెలిపారు. రాజకీయ సిఫార్సు బదిలీలు పల్నాడులో ఎక్కువయ్యా యని, ఇటీవల కాలంలో దొడ్డిదారిన జరిగిన ఉపాధ్యాయుల బదిలీలను వ్యతిరేకిస్తూ వాటిని నిలుపుదల చేయకపోతే యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని విజయసారథి తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

గురజాలటౌన్, మార్చి 15: రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ బాలకృష్ణ అన్నారు. ఎన్నికల దృష్ట్యా మండలంలోని పాత అంబాపు రం, చర్లగుడిపాడు గ్రామాల్లో శుక్రవారం సీఆర్పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్ఐ సౌందర్యరాజన్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

కారంపూడి, మార్చి 15 : స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంటర్నేషనల్ కోరమండల్ సహకారంతో రూ.4 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ జయవర్ధన్, డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సుధా స్రవంతి, ఎంఈవో రవికుమార్, హెచ్ఎం అనంతశివ, ఏవో యలమందారెడ్డి, ఏపీఎం శివకుమార్, గోపి పాల్గొన్నారు.

కరాలపాడులో టీడీపీ ఇంటింటి ప్రచారం

పిడుగురాళ్ల, మార్చి 15 : నియోజకవర్గానికి యరపతినేని ప్రకటించిన ప్రత్యేక సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి జరిగే లబ్ధిని వివరిస్తూ కరాలపాడులో పార్టీ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంకుల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి గోపాల్, మద్దసాని వెంకటరెడ్డి, యాదాల రాజశేఖర్, మంగిరెడ్డి, పాదర్తి రాజేశ్వరి, సైదులు, కళాయి బాజి, సుభాని, వట్టెపు సురేష్, కొత్రా బాబు, సాగర్, రమేష్, నూకాబత్తిన పున్నయ్య, మట్టి అంకారావు, గద్దె రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీ ఓట్లను వెంటనే తొలగించాలి

కారంపూడి, మార్చి 15: మండల పరిధిలో డబుల్ ఎంట్రీ ఓట్లను వెంటనే తొలగించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జయవర్ధన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. డబుల్ ఎంట్రీలతోపాటు చనిపోయిన వారి ఓట్లను కూడా జాబితా నుంచి తొలగించాలన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, చిరుమామిళ్ల శ్రీను, పంగులూరి హరికృష్ణ, దారివేముల నాగేంద్రబాబుపాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలి

పెదకూరపాడు, మార్చి 15 : విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ ఉప సంచాలకులు కొర్లకుంట వెంకట సుబ్బారావు అన్నారు. పెదకూరపాడు లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జన చైతన్య సమితి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షేక్ బాలి సైద్, జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకట రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టాలి : మురళీకృష్ణ

సత్తెనపల్లి, మార్చి 15 : సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, నగదు వంటి ప్రలోభాలను అధికారులు సమర్థవంతంగా అరికట్టాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. ఎన్నికల నిర్వాహణలో భాగంగా శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బు పంపిణీ వంటి వాటిని టీమ్‌ల సభ్యులు అరికట్టాలన్నారు. నోడల్ ఆఫీసర్ బాల సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ సహాయ ఎన్నికల అధికారులు, మోడల్ కోడ్ ఆఫ్ కాంట్రాక్ట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

లంకెలకూరపాడులో కన్నా నాగరాజు ప్రచారం

ముప్పాళ్ళ, మార్చి 15 : మండలంలోని లంకెలకూరపాడులో కన్నా నాగరాజు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలు, బీసీ, మైనారిటీ ఏరియాలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు కన్నా నాగరాజు సమక్షంలో వైసీపీని వీడిటీడీపీలో చేరారు. కార్యక్రమంలో క్రిష్టిపాటి రవీంద్రారెడ్డి, మోర్తల వెంకటరెడ్డి, పాలపర్తి కోటేశ్వరరావు, మలిసేడి రామారావు, శ్రీకాంత్‌రెడ్డి, ఎం.గంగ ప్రసాద్, ఆసాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాఫెడ్ మార్కెట్ ధర ప్రకారం కందుల కొనుగోలు

నకరికల్లు, మార్చి 15 : నాఫెడ్ మార్కెట్ ధరల ఆధారంగా జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కందులను కొనుగోలు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి మురళి తెలిపారు. ఆయన శుక్రవారం నకరికల్లు మండలం దేచవరం రైతు భరోసా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో దేవదాసు, ఎంపీఈవోలు రవిబాబు, హనుమంతరావు, జీడీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రెంటపాళ్ళలో టీడీపీ కార్యాలయాన్ని ప్రాంభిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

చరిత్ర హీనుడిగా మిగిలిపోయిన జగన్

సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, మార్చి 15 : ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా పరిపాలించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి జగన్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోయాడని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రెంటపాళ్లలో శుక్రవారం టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలనను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. రాష్ట్రంపై మోయలేని అప్పుల భారం జగన్ మోపాడని, ఈ సైకోను తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించటం ఖాయమని, వచ్చే ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలు కళ్ళారా చూస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు మక్కపాటి రామచంద్రరరావు, కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి భాస్కర్, ఆళ్ళ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


సత్తెనపల్లి, మార్చి 15 : టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని దూళిపాళ్ళ భాగ్యనగర్‌కు చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు శుక్రవారం రాత్రి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కన్నా విజయానికి తాము కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, జీ.చిన్నబ్బాయి, బండారు ఏలియా, కట్టా రమేష్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కనెక్టు విత్ కన్నా పోస్టర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి, మార్చి 15 : పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో శుక్రవారం సాయంత్రం ఐటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కనెక్టు విత్ కన్నా పోస్టర్‌ను టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా గ్రామ, మండల నియోజకవర్గ స్థాయిలో 9408639999 వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చునని సుధాకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రావిపాటి ప్రసాదు, మాగంటి నరేష్, శివ నాగరాజు, నూర్‌బాషా జానీ బాబు, పల్లపాటి పెద్దిరాజు, కట్టా రమేష్, తుమ్మల ఏడుకొండలు, చిన్న, జీ స్టాలిన్, బండారు ఏలియా, జీ చిన్నబ్బాయి పాల్గొన్నారు.

ముస్లింలకు మేలు చేసింది టీడీపీనే : గంగారాం ఖాశిం

ముప్పాళ్ళ మార్చి 15 : ముస్లింలకు మేలు చేసింది తెలుగుదేశం పార్టీ అని మైనారిటీ సెల్ నియోజకవర్గ నాయకుడు గంగారాం ఖాశిం అన్నారు. ఆయన శుక్ర వారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు మేలుచేసే దుల్హాన్ పథకం, విదేశీ విద్య లో భాగంగా రూ.10 లక్షల ఆర్థిక సహా యం, ముస్లిం సబ్‌ప్లాన్ నిధులు, రంజాన్ మాసంలో మసీదుల మరమ్మతులకు రూ.20 వేలను ప్రతి మసీదుకు అందజే సేదని, వైసీపీ ప్రభుత్వం మొత్తం రద్దు చేసిందని అన్నారు. రంజాన్ మాసంలో పేదముస్లింలు సంతోషంగా రంజాన్ జరుపుకునేందుకు గోధుమ పిండి, నెయ్యి, పంచదార, సేమ్యా వంటివి పండుగ ముందు చంద్రబాబు అందజేశారని నేడు జగన్ రద్దు చేశాడని ఖాశిం తెలిపారు.



వేతనం ఎప్పటికో?

● ఫిబ్రవరి జీతం చెల్లించని వైనం

● నరసరావుపేట మున్సిపాల్టీలో జాప్యం

● ఆర్థిక ఇబ్బందుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

నరసరావుపేట, మార్చి 15: మార్చి నెల 16వ తేది వచ్చింది. అయినా వేతనాలు అందలేదు. నరసరావుపేట మున్సిపాల్టీలో జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఫిబ్రవరి మాసం అందక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. సుమారు 451 మందికి జీతాలు చెల్లింపు నిలిచిపోయింది. ఇంజనీరింగ్ విభాగంలో 138 మంది, పారిశుధ్య విభాగంలో 313 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఆస్తి పన్నులు పుష్కలంగా వసూలు అవుతున్నా జీతాల ఊసే ఎత్తకపోతుండటంతో ఉద్యోగులు ఆందోళనకు గురౌతున్నారు. జీతాల మాట ఎలా ఉన్నా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. జీతాల చెల్లింపు చేసిన తర్వాతే కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు. సాంకేతిక సమస్యలు వల్లే జీతాలు చెల్లించలేకపోయామని అధికారులు తెలిపారు.

చిలకలూరిపేట యార్డుకు పాలకవర్గం

● హడావిడిగా సభ్యులు ప్రమాణ స్వీకారం

● నేడు ఎన్నికల నోటిఫికేషన్.. ప్రభుత్వం జీవో జారీ



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

చిలకలూరిపేట, మార్చి 15: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం ఈసీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద చిలకలూరిపేట మార్కెట్‌యార్డుకు పాలకవర్గాన్ని నియమించింది. ఈ మేరకు జీవో 262ను జారీ చేసింది. ప్రభుత్వం జీవో జారీ చేసిన వెంటనే కమిటీ సభ్యులు హడావిడిగా శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం కూడా చేసేశారు. యార్డు చైర్మన్‌గా గొంటు శ్రీనివాసరెడ్డి (చందవరం), వైస్ చైర్మన్‌గా మానుకొండ శ్రీనివాసరెడ్డిని నియమించారు. సభ్యులుగా మెట్టు రమాదేవి, కోవెలమూడి అరుణ, జాన్తి పార్వతి, పమిడి శైలజ, గోరంట్ల బాపారావు, షేక్ గని, గడికందుల వెంకటరత్నం, బండారు దాసు, దావల రత్నకుమారి, దేవరకొండ నాగేశ్వరరావు, సింగరేసు పోలయ్య, పెరుమాళ్ళ వెంకట సత్యనారాయణరావు, తోట గీతారాణిలను నియమించారు. కాగా గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే విడదల రజిని వ్యవహరిస్తారని జీవోలో పేర్కొన్నారు.

పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

రొంపిచర్ల, మార్చి 15: మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో ఈనెల 18వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి రొంపిచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రొంపిచర్ల, సంతగుడిపాడు, గోగులపాడు, బొగ్గరం, బుచ్చి పాపన్న పాలెం పాఠశాలలకు చెందిన 275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రెడ్డిపాలెంలోని జడ్పీ పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలో రెడ్డిపాలెం, కుంకలగుంట,చేజర్ల, కొత్తపల్లి పాఠశాలకు చెందిన 355 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఆయా పాఠశాలల్లో పరీక్షలు రాసేందుకు గోగులపాడు బుచ్చి పాపన్నపాలెం, బొగ్గరం, చేజర్ల, కుంకలగుంట, కొత్తపల్లి, సంతగుడిపాడు గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కావాల్సి ఉంది.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

వేల్పూరు(శావల్యాపురం), మార్చి 15: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్ఎం మహబూబ్ సుభానీ అన్నారు. మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో పది పరీక్షలు రాయబోతున్న 62మంది విద్యార్థులకు నర్సరావుపేటలోని వాగ్దేవి కళాశాలలో గణిత లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న వేల్పూరు వాసి కొత్తమాసు మణికంఠ శుక్రవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.

37 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

వినుకొండ, మార్చి 15 : గంగినేని కల్యాణి డిగ్రీ కళాశాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళ నిర్వహించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సంజీవరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మినీ జాబ్‌మేళకు మూడు కంపెనీలు హాజరుకాగా అర్హత కల్గిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 37మందిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళ నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ హరిబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ కేవీఎస్ కోటేశ్వరరావు, కంపెనీ ప్రతినిధులు ఎం రవీంద్రనాయక్‌లతోపాటు జాని, బాషా తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు గీతమ్స్ విద్యార్థులు ఎన్నిక

వినుకొండ, మార్చి 15 : పట్టణంలోని గీతమ్స్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సైనిక్ స్కూల్ ఎంట్రాన్స్ పరీక్షలో అత్యధిక మార్కు లు సాధించి అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 28వ తేదిన లయోలా పాఠశాల నందు జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో ప్రతిక్ శివసాయి 194, జశ్వంత్ రెడ్డి 187, చేతన్ 153,హర్షిత 143, అరవింద్‌రెడ్డి 139 ర్యాంకులు సాధించి సైనిక్ స్కూల్లో అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల్లో అర్హత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణితో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించుకోవాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి ఈ వెంకటేశ్వర్లు

నరసరావుపేట రూరల్, మార్చి 15: విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో స్కౌటింగ్ ఎంతగానో తోడ్పడుతుందని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు స్కౌట్స్ సేవలు ఎంతగానో దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఈ వెంకటేశ్వర్లు అన్నారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకరభారతిపురం జిల్లా పరిషత్ హైస్కూలు నందు స్కౌట్స్ & గైడ్స్ ట్రూప్ ప్రారంభ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ట్రూపును ప్రారంభించిన డీఈవో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను ప్రారంభించవలసిన ఆవశ్యకత ఉందని, దేశానికి శ్రమశిక్షణ కలిగిన పౌరులను అందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో సహాయ పడుతుందని, వీరి సేవలు అనిర్వచనీయమని అన్నారు. శంకరభారతిపురం హైస్కూలు అన్ని రంగాల్లో ముందుంటూ స్కౌట్ యూనిట్‌ను ప్రారంభించిన పమ్మి వెంకటరెడ్డిని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు. పార్వతి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సౌట్స్ సేవలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. జడ్పీ హైస్కూలు హెచ్ఎం బీవీఎస్ వరప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మెట్టు శివరామిరెడ్డి మృతికి అరవిందబాబు సంతాపం

రొంపిచర్ల, మార్చి 15: మండలంలోని విప్పర్లపల్లి గ్రామానికి చెందిన మెట్టు శివరామిరెడ్డి(55) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. కాగా మరణ వార్త తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్ అరవిందబాబు ఆయన మృత దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో టీడీపీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొని యాడారు. శివరామిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు అని తెలిపారు. శివరామిరెడ్డి తమ్ముడు వెంకటేశ్వరరెడ్డి గతంలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా, టీడీపీ మండల అధ్యక్షుడిగా పని చేశారు. మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు ఆయన మృతికి నివాళులర్పించారు.

బీజేపీలో చేరిన ఉప్పాల

చిలకలూరిపేట, మార్చి 15: పట్టణంలోని సుబ్బయ్యతోటకు చెందిన మహాత్మా జ్యోతిరావు పూలే చైతన్య సేవాసంఘం అధ్యక్షులు ఉప్పాల భాస్కరరావు శుక్రవారం బీజేపీలో చేరారు. ఆయనతో పాటు విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు ఉండవల్లి కోటేశ్వరరావు కూడా ఆ పార్టీలో చేరారు. బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు సమక్షంలో శుక్రవారం ఇక్కడ ఈ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కక్కెర శ్రీనివాస్‌యాదవ్, పీ శ్రీనివాసరావు, పోత్రు పూర్ణచంద్రరరావు, ఎం శివనాగేశ్వరరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, టీ జయరామిరెడ్డి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

17న బొప్పూడి వద్ద జరిగే సభను జయప్రదం చేయాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 15: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ ఈ నెల 17న నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట నియోజకవర్గ కార్యాలయంలో విస్తృత కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ మ్యానిఫెస్టో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఈ బహిరంగసభకు నారా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారన్నారు. నరసరావుపేట నుంచి సుమారు 40వేల మంది బహిరంగసభకు తరలివెళతారన్నారు. నరసరావుపేట అభివృద్ధికి మ్యానిఫెస్టో విడుదల చేశామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, అల్లంశెట్టి మోహనరావు, గట్టుపల్లి సత్యనారాయణ, కొల్లి బ్రహ్మయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి, గూడూర్ శేఖర్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, వేములపల్లి వెంకటనరసయ్య, వనమా శివ, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అత్తలూరి సుబ్బారావు, ఇమ్మిడిశెట్టి కాశయ్య పోను గోటి శ్రీనివాసరావు, కొక్కిరాల గంగాధర్, మాజీ కౌన్సిలర్ కదం నాగ జ్యోతి, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, మానుకొండ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో నూతన ఆపరేషన్ థియేటర్ ప్రారంభం



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ లోతేటి శివ శంకర్, ప్రభుత్వ వైద్యులు

నరసరావుపేట లీగల్, మార్చి 15 : పట్టణంలోని లింగంగుంట్లలో గల జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లో ఈఎన్‌టీ విభాగంలో ఐవోఐ వారి కార్పోరేట్ , మైక్రో స్కోప్ ఆపరేషన్ థియేటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి ఐవోసీఎల్ వారు రూ.30 లక్షలు విలువ చేసే సామగ్రిని అందజేయటం సంతోషంగా ఉందన్నారు. రూ 9 లక్షలు విలువ చేసే ఆపరేటింగ్, మైక్రో స్కోప్ సిస్టమ్‌ను తీసుకు రావటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ లోతేటి శివశంకర్, పలువురు ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేశాం

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివారెడ్డి

రొంపిచర్ల, మార్చి 15: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని ముత్తనపల్లి, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముత్తనపల్లిలో ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. వడ్లమూడివారిపాలెం గ్రామంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విరాళాలతో ప్రజాగళం సభకు

నాదెండ్ల, మార్చి 15 : బొప్పూడి వద్ద ఈనెల 17న జరగనున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజాగళం సభకు మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విరాళాలను ప్రకటించారు. గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎవరికి తోచిన విధంగా వారు లక్ష నుంచి రూ 10వేలు వరకు విరాళాలను ప్రకటించారు. సుమారు రూ.6 లక్షల రూపాయల విరాళాలను ప్రకటించటం విశేషం. ఆ విరాళాలతో వాహనాలు ఏర్పాటు చేసుకొని కార్యకర్తలను సభకు తరలించాలని సమావేశంలో నిర్ణయించారు.

ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పని చేయాలి

● వినుకొండ క్లస్టర్ ఏపీడీ బూసిరెడ్డి



మేట్‌లతో మాట్లాడుతున్న బూసిరెడ్డి

శావల్యాపురం, మార్చి 15: ఉపాధిహామీ కూలీలు పని ప్రదేశాల్లో నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసి గరిష్ట వేతనాన్ని పొందాలని వినుకొండ క్లస్టర్ ఏపీడీ ఈదర బూసిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ మహిళా మేట్‌లతో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వ హించారు. ఏపీడీ మాట్లాడుతూ మహిళామేట్‌లు గ్రూపులోని కూలీల కు కొలతలపై అవగాహన కల్పించి గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులు చేయించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం పని ప్రదేశాల్లో రెండుసార్లు కూలీలను ఫోటో లు తీయాలని సూచించిందని, కాబట్టి కూలీలు సంయమనం పాటించి ఫోటోలు దిగాలన్నారు. మండలవ్యాప్తంగా రోజుకు 600 మంది పనులకు హాజరవుతున్నారని, కూలీల సంఖ్యను పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 439 కుటుంబాలకు ప్రస్తుతం 100 పనిదినాలు కల్పించామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను త్వరలో కేంద్ర బృందం తనిఖీ చేయనుందన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా ఫారంపాండ్స్, కుంటలు తదితర పనుల వైపు మొగ్గు చూపాలన్నారు. ఏపీవో కటారపు రామారావు, బేబీరోజ, ఆపరేటర్ అశోక్ పాల్గొన్నారు.

నేడే జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, మార్చి 15: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో న్యాయమూర్తులు సూర్యనారాయణమూర్తి, మధుస్వామి, ప్రవల్లికలు మూడు బెంచ్‌లుగా ఏర్పడి కేసులను పరిష్కరిస్తార ని ఆయన తెలిపారు. అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసు లు, ముందస్తు వ్యాజ్యాలు, మోటారు వాహన ప్రమాద కేసులు, బీమా, ముంద స్తు వ్యాజ్యాలు తదితర అన్ని రకాల కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించ వచ్చన్నారు. కోర్టు ఆవరణలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం వరకు అదాలత్ కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగప రుచుకోవాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

● ఐసీడీఎస్ పీడీ ఉమారాణి

రొంపిచర్ల, మార్చి 15: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ పీడీ ఉమారాణి తెలిపారు. మండలంలోని రొంపిచర్లలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, తల్లులు, బాలింతలు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు తీసుకోవటం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ శశిదేవి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారి బదిలీలు వెంటనే రద్దు చేయాలి

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్

నరసరావుపేట టౌన్, మార్చి 15: సిఫార్సు బదిలీలు, లక్షలాది రూపాయలు చేతులు మారడం ద్వారా ప్రభుత్వం చేపట్టిన అడ్డగోలు బదిలీలు వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023 మే, జూన్‌లలో ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు నిర్వహించినప్పటికి ఏడాదిలోపే కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ పెద్ద ఎత్తున ఈ సమయంలో అడ్డదారి బదిలీలు జరపడం సరికాదన్నారు. పల్నాడు ప్రాంతంలోని పాఠశాలలో పనిచేస్తున్న అనేక మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వ పెద్దలు బదిలీలకు సిపార్సు చేయడంతో ఈప్రాంత విద్యారంగం మరోసారి ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటుందని అన్నారు. కాసులున్న వారికి మంత్రుల అండదండలున్న వారికి అక్రమ బదిలీలు చేస్తుంటే సాధారణ ఉపాధ్యాయుల పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న ఈ కాలంలో విద్యాసంవత్సరం మరోనెలలో ముగుస్తున్న సమయంలో ఈ అడ్డదారి బదిలీలు చేయటం విద్యారంగానికి ఏమి లాభమో, ప్రభుత్వం పారదర్శకత ఏమిటో తెలియ వచ్చిందన్నారు. కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ చేసిన ఈ బదిలీలు రద్దు చేయకుంటే తగు మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

టీడీపీ నేత కందిమళ్ళ హనుమంతరావు సతీమణి కన్నుమూత



పరామర్శిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి 15: చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కందిమళ్ళ హనుమంతరావు భార్య రాజకుమారి(64) శుక్రవారం కన్ను మూశారు. ఆమె కొంత కాలంగా అస్వస్థులుగా ఉన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ కందిమళ్ళ వాసుదేవ్ అంకమ్మచౌదరి వారి కుమారుడే. ఈనెల 18న అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా కందిమళ్ల హనుమంతరావు టీడీపీ మండల అధ్యక్షుడిగా ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శిగా గతంలో వ్యవహరించారు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మురికిపూడికి వెళ్లి హనుమంతరావు, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజకుమారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు హనుమంతరావు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలి

● ఆర్వో సుబ్బారావు

ఈపూరు, మార్చి 15: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఎన్నికల అధికారి సుబ్బారావు పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఈపూరు మండలంలో 46 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. అన్ని బూత్‌లలో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని వివరాలు తెలియజేస్తూ చార్ట్‌ను ఏర్పాటు చేయాలని బూత్ లెవల్ అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దారు దిలీప్‌కుమార్, డిప్యూటి తహసీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, బూత్‌స్థాయి అధికారులు ఉన్నారు.

19న వాహనాల బహిరంగ వేలం

నరసరావుపేట లీగల్, మార్చి 15: 19వ తేదీన నరసరావుపేట ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో గల టౌన్ హాల్ పక్కన ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో ఉదయం 11 గంటల నుంచి వాహనాల వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు స్టేషన్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

వినియోగదారులు హక్కులను తెలుసుకోవాలి

● జిల్లా సివిల్ సప్లయి అధికారి పద్మశ్రీ

● ఘనంగా అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం



'వినియోగదారుడా మేలుకో' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా సివిల్ సప్లయి అధికారి పద్మశ్రీ

నరసరావుపేట రూరల్, మార్చి 15: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలి జిల్లా సివిల్ సప్లయి అధికారి పద్మశ్రీ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం స్పందన హాల్లో అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మురికిపూడి ప్రసాద్ సేకరించిన, రచించిన 'వినియోగదారుడా మేలుకో' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురికిపూడి ప్రసాద్‌ను జిల్లా అధికారులు అభినందించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సునీత, తూనికల కొలతలశాఖ జిల్లా అధికారులు అల్లూరయ్య శంకర్రావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు లక్ష్మీనారా యణ వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ పిల్లి యజ్ఞనారాయణ, కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా సెక్రెటరీ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాపు బుకింగ్ పత్రాల పంపిణీ

రొంపిచర్ల, మార్చి 15: మండలంలోని వడ్లమూడివారిపాలెంలో గ్రామంలో వ్యవసాయశాఖ ద్వారా శుక్రవారం ఈ క్రాపు బుకింగ్ పత్రాలను పంపిణీ చేశారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాపు చేయించుకోవా లన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ, ఏవో, రైతులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను జయప్రదం చేయండి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 15: టీడీపీ, జనసేన, బీజేపీలు ఈనెల 17న చిలకలూరిపేట మండలం బొప్పొడి వద్ద సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రజాగళం బారీబహిరంగసభకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మూడుపార్టీల నాయకులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ తొలిసారి పల్నాడు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో లక్షలాది మంది కార్యకర్తలు తరలివెళ్ళి ఆయనకు ఘనస్వాగతం పలకాలన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సభలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీపార్టీలు పొత్తు పెట్టుకోవడం శుభపరిణామమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బారీగా జనసమీకరణ చేసి ప్రజాగళం సభను విజయవంతం చేయాలన్నారు. వినుకొండ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీను, టీడీపీ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి షమీంఖాన్, పట్టణ టీడీపీ అధ్యక్షులు అయూబ్‌ఖాన్, టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, మాదినేని ఆంజనేయులు, జరపాల గోవిందనాయక్, తిరుమలశెట్టి బాలయ్య, మీసాల మురళికృష్ణ తదితరులున్నారు.

వైద్యశాలలో చికిత్స పొందుతున్న పఠాన్ బాజీకి జీవీ పరామర్శ

వినుకొండటౌన్, మార్చి 15 : ఇటీవల విఠంరాజుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న పఠాన్ బాజీని జీవీ ఆంజనేయులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో మహేష్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా గాయాలతో బాధపడుతున్న పఠాన్ బాజీని స్వయంగా తన కారులో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించామని అన్నారు. బాజీ ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఆయన సంతోషం వ్యక్తం చేసి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని నింపి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్‌తోపాటు జాని, పీవీ సురేష్, అక్బర్‌బాషా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

వినుకొండ టౌన్, మార్చి 15: పట్టణంలోని 11వ వార్డులో అధికార పార్టీకి చెందిన 10 కుటుంబాలు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. వార్డు పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో యడ్లపాడు విద్యార్థి సత్తా



నిర్వాహకుల నుంచి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జమీర్

యడ్లపాడు, మార్చి 15: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ జమీర్ సత్తా చాటాడు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా గంగవరం మండలం పలమనేరులోని మదర్ థెరెస్సా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో మ్యాన్ హోల్‌ను శుభ్రం చేయడంపై రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శించాడు. రాష్ట్రస్థాయిలో 240 ప్రాజెక్టులు రాగా 24 జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఉమ్మడి గుంటూరుజిల్లా నుంచి 13 ప్రాజెక్టులు ప్రదర్శనకు రాగా యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన జమీర్ రూపొందించిన ప్రాజెక్ట్‌తోపాటు క్రోసూరు జయభారత్ పాఠశాలకు చెందిన విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. పోటీలలో సత్తా చాటి జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టును రూపొందించి పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థి జమీర్‌ను, సైన్స్ ఉపాధ్యాయిని రాధను హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు శుక్రవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అబినందించారు.

కృష్ణవేణి డిగ్రీ కాలేజీ 2కే వాక్, ఫెస్ట్ విజయవంతం



జెండా ఊపి 2కే వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 15: పట్టణంలో నిర్వహించిన కృష్ణవేణి డిగ్రీ కాలేజీ 2కే వాక్, ఫెస్ట్ విజయవంతం అయిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కాలేజీ విద్యార్థులు వికసిత్ భారత్‌లో భాగంగా ఓటు హక్కు ప్రాముఖ్యత తెలియజేస్తూ 2కే వాక్, ఫెస్ట్ నిర్వహించారు. 2కే వాక్‌ను కలెక్టర్ శివశంకర్ లోతేటి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఓటుహక్కు వినియోగం, ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. మీ ఓటు, మీ హక్కు, ఓటు వేయడం మా బాధ్యత, అని నినాదాలు చేశారు. 2కే వాక్ కార్యక్రమాన్ని పట్టణంలోని రామిరెడ్డిపేట మెయిన్ క్యాంపస్ నుంచి చిలకలూరిపేట బైపాస్ రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కాలేజీ వరకు నిర్వహించారు. 2కే వాక్‌లో విద్యార్థుల దేశభక్తి నృత్యాలతో చేసిన ప్రదర్శనలు ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. 2కే వాక్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో జిల్లా అధికారులు కే వినాయకం, బీ బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కే నారసయ్య, ఎంఆర్‌కే సతీష్‌బాబు, డాక్టర్ యోగేశ్వరరావు, కే వీరరాఘవలు, టీ సురేఖ, పీడీ ఆదిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో శావల్యాపురం విద్యార్థిని



విద్యార్థిని బసవరాణి

శావల్యాపురం, మార్చి 15: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఉప్పు బసవరాణి మంచి ప్రతిభ కనబరచి ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయస్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించినట్లు పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. పీడీ మాట్లాడుతూ బిహార్‌లోని పాట్నాలో ఈనెల 10 నుంచి 14 వరకు జరిగిన ఆల్‌ఇండియా జూనియర్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో బసవరాణి ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొందని, తుదిపోరులో తమిళనాడు జట్టు ప్రథమస్థానంలో, ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయన్నారు. ఈ ఏడాది పాఠశాలకు చెందిన సమీర, దివ్య, బసవరాణిలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారని, స్కూల్‌గేమ్స్ పోటీల్లో మరో నలుగురు బాలికలు జాతీయస్థాయికి ఎంపిక కాగా పోటీలు జరగాల్సి ఉందన్నారు. బసవరాణిని పాఠశాల హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, పీడీ రాధాకృష్ణ, సీనియర్ ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, భువనేశ్వరి, నిర్మలాదేవి తదితరులు అభినందించారు.